## ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే **దయచేసి నమ్మవద్దు.**

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

– ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 35, పేజీలు - 08

శుక్రవారం, జులై 31, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# బాగా పనిచేస్తున్నందుకే తప్పుకోవాలా.?

## ప్రతి నెల ఒకటో తేదీన టీచర్లకు జీతాల హామీ

- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం





**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ విద్యాశాఖలో తెస్తున్న సంస్కరణలు, పాలనాపరమైన నిర్ణయాలపై విపక్షాలు, ఉపాధ్యాయ సంఘాలు చేస్తున్న విమర్శలకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అత్యంత ఘాటుగా, స్పష్టమైన సమాధానం ఇచ్చారు. విదేశాల్లో పర్యటించి వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడిన సీఎం, రాష్ట్రంలో పూర్తిస్థాయి విద్యాశాఖ మంత్రి లేరంటూ వ్యాఖ్యానిస్తున్న వారి వ్యాఖ్యలను పూర్తిగా తిరస్కరించారు. విద్యాశాఖను తన వద్దే ఉంచుకుని సమర్థవంతంగా నిర్వహిస్తున్నానని, ఈ శాఖ అత్యంత వేగంగా పురోగతి సాధిస్తున్నందుకే తనను మంత్రి బాధ్యతల నుంచి వైదొలగాలని అడుగుతున్నారా అని సూటిగా ప్రశ్నించారు.

### విద్యాశాఖలో మంచి పురోగతి

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్పకాలంలోనే విద్యాశాఖలో సాధించిన విజయాలను సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘంగా వివరించారు. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా 55 రోజుల్లోనే 11 వేల ఉపాధ్యాయ నియామకాలు పూర్తి చేశామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో

2లో..

ప్రధాని మోదీ అధ్యక్షతన

# సీసీఎస్ సమావేశం!

## – పశ్చిమ ఆసియా సంక్షోభంపై చర్చ!



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పార్లమెంట్ హౌస్ సముదాయంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేబినెట్ కమిటీ ఆన్ సెక్యూరిటీ (సీసీఎస్) కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాతీయ భద్రతకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. రక్షణ, హోం వ్యవహారాలు, ఆర్థిక, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖల కీలక మంత్రులతోపాటు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా హాజరయ్యారు. ముగ్గురు కేంద్ర మంత్రులను కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఆహ్వానించారు.

### ఏ సమస్యలపై చర్చ జరిగింది

అధికారిక వర్గాల సమాచారం ప్రకారం, పశ్చిమ ఆసియా సంక్షోభానికి సంబంధించి రక్షణ విషయాలపై జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో హాజరైన మంత్రులందరూ తమ మంత్రిత్వ శాఖల వివరాలు, వాటి ప్రస్తుత స్థితి, భవిష్యత్ వ్యూహం ఏంటో తెలియజేశారు. భారత నావికుడి మరణంపై భారత ప్రభుత్వం ఎలాంటి పరిస్థితుల్లోనైనా తీవ్రంగా స్పందిస్తుందని, దానిని సహించబోదని సమావేశం నొక్కి చెప్పింది.

2లో..

వర్షాలు, వరదలతో నదులు,

# రిజర్వాయర్ లకు జలకళ

## – తెలంగాణా వ్యాప్తంగా ఇదే పరిస్థితి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ కృష్ణా నది బేసిన్‌లోని ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుండి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టుల నుండి వస్తున్న నీటి కారణంగా జూరాల ప్రాజెక్టుకు సుమారు 32,000 నుండి 46,580 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, అధికారులు విద్యుత్ ఉత్పత్తి మరియు గేట్ల ద్వారా దాదాపు 30,700 నుండి 44,254 క్యూసెక్కుల

2లో..

# వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

## – జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి చట్టపరమైన రక్షణ



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** జాతీయ గేయం వందేమాతరాన్ని అవమానించడం లేదా దాని గానానికి ఆటంకం కలిగించడాన్ని నేరంగా పరిగణించే కీలక బిల్లుకు లోక్‌సభ గురువారం ఆమోదం ముద్ర వేసింది. జాతీయ గౌరవ పరిరక్షణ (సవరణ) బిల్లు, 2026ను ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ మూజువాణి ఓటుతో ఆమోదించింది.

2లో..

# బాబు విజన్.. జగన్ మావిగన్

## – మెగా మెట్రో విజన్ వర్సెస్ వైసీపీ మైండ్ గేమ్




**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ ప్రాజెక్టుల పురోగతిపై ఇటీవల నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేసిన కీలక వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు తెరలేపాయి. అమరావతి అంటే కేవలం 29 గ్రామాల సముదాయం మాత్రమే కాదు విజయవాడ, గుంటూరు నగరాలతో అనుసంధానమైన సమగ్ర బృహత్ రాజధాని ప్రాంతం అంటూ చంద్రబాబు ఇచ్చిన స్పష్టత, అమరావతి బ్రాండ్‌ను పునర్నిర్మించే వ్యూహాత్మక అడుగుగా కనిపిస్తోంది. విజయవాడ–గుంటూరు–అమరావతిలను కలిపి ఒక మెగా మెట్రోపాలిటన్ రీజియన్‌గా తీర్చిదిద్దడమే ఏపీ భవిష్యత్ ఆర్థిక, సామాజిక దిశను నిర్దేశించే అసలైన మాస్టర్ ప్లాన్ అని

2లో..

# అప్పలరాజు కుటుంబంపై కూటమి కుట్ర

## సీదిరి అప్పలరాజుతో జగన్ ములాఖత్ రద్దు

- అంపోలు జైల్లో రిమాండ్‌లో ఉన్న సీదిరి అప్పలరాజు
- ములాఖత్ లో కలిసేందుకు వెళ్లిన జగన్
- సాయంత్రం 5 దాటడంతో అనుమతి నిరాకరించిన జైలు అధికారులు



**అమరావతి (ప్రశ్న న్యూస్)** వైసీపీ నేత సీదిరి అప్పలరాజుతో ములాఖత్ అయ్యేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌కు జైలు అధికారులు అనుమతి నిరాకరించారు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లాలోని అంపోలు జైలులో ఉన్న సీదిరి అప్పలరాజును పరామర్శించేందుకు వైఎస్ జగన్ వెళ్లిన సంగతి తెలిసిందే. సీదిరి అప్పలరాజుతో ములాఖత్ అయ్యేందుకు అనుమతి తీసుకున్నారు. అయితే నిర్ణయించిన సమయం ముగిసిన తర్వాత జగన్ జైలు వద్దకు చేరుకున్నారు. దీంతో జైలు నిబంధనల ప్రకారం సీదిరి అప్పలరాజుతో ములాఖత్ అయ్యేందుకు

2లో..

ఇందిరమ్మ ఇళ్లు పథకంపై

# వదంతులు నమ్మొద్దు

- ఈ పథకానికి దరఖాస్తు చేస్తే ఇతర సంక్షేమ పథకాలు ఆగవని స్పష్టత
- తప్పుడు ప్రచారం చేసేవారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక
- హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ కీలక వ్యాఖ్యలు




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంపై సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ కీలక స్పష్టత ఇచ్చారు. ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం నుంచి వచ్చే ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు నిలిచిపోతాయని జరుగుతున్న ప్రచారంపై ఆయన క్లారిటీ ఇచ్చారు. ఈ ప్రచారంలో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారాన్నే విశ్వసించాలని కోరారు.

2లో..

# కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు

## – ప్రభుత్వానికి నిపుణుల కమిటీ సూచనలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు సబ్సిడీపై విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్గానిక్ పద్ధతిలో కూరగాయలు, ఇతర పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలోని బోధి పెవిలియన్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎల్నినో పరిస్థితుల ప్రభావంపై నిపుణుల కమిటీ నివేదికను సమర్పించింది. సుమారు రూ. 803కోట్ల రూపాయలతో కార్యాచరణ చేపట్టాలని ప్రభుత్వానికి సూచించినట్లు కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి తెలిపారు. విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని

2లో..

మలక్‌పేట్ టీవీ టవర్‌కు

# కొత్త అవతారం

## – ఇంటర్నెట్ లేకుండానే ఫ్రీ టీవీ ఛానళ్లు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌కు ఒకప్పుడు గుర్తింపుగా నిలిచిన మలక్‌పేట్ టీవీ టవర్ మరోసారి వార్తల్లో నిలిచింది. దూరదర్శన్ అనలాగ్ ప్రసారాల యుగంలో లక్షలాది ఇళ్లకు టెలివిజన్ సిగ్నల్స్‌ను అందించిన ఆ చారిత్రక టవర్ ఇప్పుడు సరికొత్త టెక్నాలజీతో కొత్త బాధ్యతలు చేపట్టేందుకు రెడీ అవుతోంది. ఇంటర్నెట్ లేదా నెలవారీ సబ్‌స్క్రిప్షన్ అవసరం లేకుండానే నేరుగా

2లో..

పెల్లెట్ గన్స్ వాడకంపై

# మార్గదర్శకాలు అవసరం

## – పెల్లెట్ వినియోగంపై సుప్రీంకోర్టు విచారణ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) జులై 20న జరిగిన 'సంసద్ చలో' విద్యార్థుల నిరసనలో మెటాలిక్ పెల్లెట్ గన్స్ వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుతంగా నిరసన తెలిపే వారిపై అధిక బలప్రయోగం జరిగిందన్న

2లో..

# పెద్దిని బతికించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం

- అమెరికా, లండన్ వైద్యులతో సంప్రదింపులు జరుపుతున్నాం
- అయినా విషమంగానే పరిస్థితి ఉందన్న హరీష్ రావు
- తుది నిర్ణయం కుటుంబానిదే అన్న హరీష్ రావు



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** బీఆర్ఎస్ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన సంగతి తెలిసిందే. ఈనెల 26న ఇంట్లో అకస్మాత్తుగా కుప్పకూలిపోగా కుటుంబసభ్యులు మొదట హనుమకొండలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు అత్యవసర చికిత్స అందుతోంది. ఈ నేపథ్యంలో పెద్ది ఆరోగ్య పరిస్థితిపై మాజీ మంత్రి హరీష్ రావు

2లో..

# బాగా పనిచేస్తున్నందుకే తప్పుకోవాలా.?

ఉన్న 30 వేల మంది టీచర్ల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా పూర్తి చేశామని గుర్తుచేశారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడంతో పాటు ఉచిత అల్పాహారం, కేజీ నుంచి ప్లస్ టూ వరకు నాణ్యమైన విద్యనందించే దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. ఈ విద్యాసంవత్సరంలోనే ప్రభుత్వ బడుల్లో లక్షకు పైగా కొత్త అడ్మిషన్లు పెరిగాయని, దేశంలో తెలంగాణ విద్యాశాఖ స్థానం 28 నుంచి 18కి మెరుగుపడిందని గణాంకాలతో సహా వెల్లడించారు.

### ఉపాధ్యాయ సంఘాలు పిల్లల సమస్యలపై పోరాడాలి!

ఉపాధ్యాయ సంఘాల తీరుపై కీలక వ్యాఖ్యలు చేశారు. మీరు పిల్లల సమస్యలపై, వారి భవిష్యత్తు కోసం పోరాడండి.. మీ సొంత సమస్యలపై కాదు  అని రేవంత్ రెడ్డి ఉపాధ్యాయులకు హితవు పలికారు. సంఘాల అధ్యక్షులతో తాను స్పష్టంగా చెప్తున్నానని, ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ తన బాధ్యతగా వదిలేయాలని, వారు అడగకముందే పరిష్కరించే దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రతి నెలా ఒకటో తారీఖునే జీతాలు చెల్లిస్తూ సౌకర్యవంతమైన వాతావరణాన్ని కల్పించిందని, టీచర్లు తమ దృష్టినంతా విద్యార్థుల నైపుణ్యాభివృద్ధిపైనే కేంద్రీకరించాలని పిలుపునిచ్చారు.

### భాష అసలు సమస్య కాదు!

గ్లోబల్ ఉద్యోగ అవకాశాలు, విద్యార్థుల ఉపాధి అర్హతలపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా రాష్ట్రం నుంచి లక్షా 10 వేల మంది ఇంజనీరింగ్ పట్టాలు పొందుతున్నప్పటికీ, కనీస ఉద్యోగ దరఖాస్తు నింపడం కూడా రాకపోవడం విచారకరమని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలతో పాటు గ్లోబల్ భాషా ప్రావీణ్యం పెంచాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గత 25 ఏళ్లుగా మనం కేవలం అమెరికాపైనే ఆధారపడ్డామని, అయితే ఇప్పుడు జర్మనీ, జపాన్, సౌత్ కొరియా వంటి దేశాల్లో కోట్లాది అవకాశాలు వేచి ఉన్నాయని వెల్లడించారు. భాష అనేది కేవలం ఒక సంభాషణా సాధనమే తప్ప అదే జ్ఞానం కాదని, చైనా, జర్మనీలు కేవలం 10 శాతం ఇంగ్లీష్‌తోనే ప్రపంచాన్ని శాసిస్తున్నాయని ఉదాహరించారు.

### త్వరలో ఉపాధ్యాయ సంఘాలతో సమీక్ష

రాబోయే ఐదేళ్లలో గ్లోబల్ ప్లాట్‌ఫామ్‌పై తెలంగాణ విద్యావ్యవస్థను ఆదర్శంగా నిలిపేలా ఆరు నెలలకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమీక్ష నిర్వహిస్తానని సీఎం ప్రకటించారు. విద్యార్థుల భవిష్యత్తును దిద్ది తీర్చే గురుతర బాధ్యత ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందనే విషయాన్ని గుర్తించాలని కోరారు. రాజకీయం కోసం విమర్శలు చేసేవారికి తమ సంస్కరణలే సమాధానం చెప్తాయని, తెలంగాణ రూపురేఖలను మార్చేలా విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# ప్రధాని మోదీ అధ్యక్షతన

# సీసీఎస్ సమావేశం!

ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కోవడానికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేసింది. వచ్చే ఏడాది రబీ పంటకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

### సమావేశంలో ఎవరెవరు పాల్గొన్నారు

ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్ షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ హాజరయ్యారు. కేంద్ర మంత్రులు సర్బానంద సోనోవాల్, హర్దీప్ సింగ్ పూరి, పీయూష్ గోయల్ కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు.

### ఆలస్యంగా అమిత్ షా రాక

హోం మంత్రి అమిత్ షా పార్లమెంట్ హౌస్ సముదాయంలోని ప్రధానమంత్రి కార్యాలయానికి ఆలస్యంగా వచ్చారు. ముందుగా పలువురు సీనియర్ ప్రభుత్వ మంత్రులు ఉన్నారు. నివేదికల ప్రకారం, ఇతర కీలక మంత్రులు వచ్చిన సుమారు అరగంట తర్వాత అమిత్ షా సమావేశానికి వచ్చారు.

### జాతీయ భద్రతా సమస్యలపై చర్చ

ప్రధానమంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం జాతీయ భద్రతా దృక్కోణం నుంచి అత్యంత ముఖ్యమైందిగా చెబుతున్నారు. భద్రత, వ్యూహాత్మక అంశాలపై సీనియర్ మంత్రులు,  జాతీయ భద్రతా సలహాదారుతో సవివరంగా చర్చలు జరిగాయి.

# వర్షాలు, వరదలతో నదులు, రిజర్వాయర్ లకు జలకళ

నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

### జూరాల నుండి శ్రీశైలానికి వరద ఇన్ ఫ్లో

జూరాల నుండి వస్తున్న నీటి ప్రవాహం వల్ల శ్రీశైలం జలాశయానికి 27,210 నుండి 35,913 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతుంది, అయితే ప్రస్తుతం స్పిల్ వే గేట్లు ఎత్తకుండా కేవలం తాగునీటి అవసరాలు మరియు కాలువల కొరకు మాత్రమే సుమారు 1,600 క్యూసెక్కుల అవుట్ ఫ్లోను వదులుతున్నారు.

### నాగార్జున సాగర్ తాజా పరిస్థితి ఇలా

ఇక శ్రీశైలం నుండి దిగువన ఉన్న నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి ఇంకా పెరగకపోవడంతో, ప్రస్తుతం అక్కడ ఇన్ ఫ్లో మరియు అవుట్ ఫ్లో రెండు కూడా సాధారణ తాగునీటి అవసరాలకు సరిపడా 900 నుండి 5,647 క్యూసెక్కుల మధ్య అతి తక్కువ స్థాయిలో కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోనూ, ఎగువన కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా వాగులు , వంకలు పొంగి పొర్లుతున్నాయి. నదులు, రిజర్వాయర్ లు జల కళను సంతరించుకున్నాయి.

### గోదావరిలో వరద ఉధృతి

భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతోంది. ప్రస్తుతం నది నీటిమట్టం 27 అడుగులుగా ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తోన్న వర్షాల కారణంగా నదికి వరద ప్రవాహం గంటగంటకూ పెరుగుతోందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 20 టీఎంసీలు కాగా, ప్రసుత్తం 13.93 టీఎంసీలు ఉంది. నీటిమట్టం 148 మీటర్లు కాగా, ప్రస్తుతం 145.58 మీటర్లుగా ఉంది.

### నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు ఇన్‌ఫ్లో 78,034 క్యూసెక్కులు, అవుట్‌ఫ్లో 16,025 క్యూసెక్కులుగా ఉంది. మరోవైపు నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరదనీరొచ్చి చేరుతోంది. గురువారం ప్రాజెక్టులోకి 3935 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా ప్రస్తుతం నీటిమట్టం 1395.8 అడుగులుగా ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు కాగా ప్రస్తుతం 7.46 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

### సింగూరు జలాశయానికి వరద ప్రవాహం

సింగూరు జలాశయానికి కూడా వరద ప్రవాహం కొనసాగుతోంది.నిర్మల్ జిల్లా భైంసాలో గడ్డెన్న వాగు ప్రాజెక్టులోకి 4500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 358.70 మీటర్లు కాగా ప్రస్తుత నీటిమట్టం 355.8 మీటర్లుగా ఉంది.

# వందేమాతరం బిల్లుకు లోక్ సభ ఆమోదం

బుధవారం ఈ బిల్లు రాజ్యసభలోనూ ఆమోదం పొందింది. 1971 నాటి జాతీయ గౌరవ పరిరక్షణ చట్టానికి ఈ బిల్లు సవరణలు చేపడుతుంది. ఇప్పటివరకు జాతీయ జెండా, రాజ్యాంగం, జాతీయ గీతం 'జన గణ మన'కు మాత్రమే ఉన్న చట్టపరమైన రక్షణ ఇకపై వందేమాతరం గేయానికి కూడా వర్తించనుంది. నూతన నిబంధనల ప్రకారం, ఎవరైనా ఉద్దేశపూర్వకంగా వందేమాతరం గానానికి ఆటంకం కలిగించినా లేదా దానిని అవమానించినా గరిష్టంగా మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది.

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. జాతీయ గీతంతో సమానంగా వందేమాతరానికి సమున్నత గౌరవం కల్పించడమే ఈ చట్టం ప్రధాన ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా వివరించారు. సభలో చర్చ కొనసాగుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు ఇతర అంశాలపై పట్టుబడుతూ నిరసనలు వ్యక్తం చేయగా, వారు ప్రతిపాదించిన సవరణలను సభ తోసిపుచ్చింది. వందేమాతరం 150వ వార్షికోత్సవాల నేపథ్యంలో ఈ బిల్లును తీసుకురావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# బాబు విజన్.. జగన్ మావిగన్

ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

### రాజధాని పరిధిని ప్రచారం చేస్తున్న ప్రభుత్వం

ఈ ప్రకటన వెనుక విస్తృతమైన రాజకీయ, నరేటివ్ పోరాటం దాగి ఉంది. గత కొద్దికాలంగా అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ను తగ్గించేందుకు ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నిరంతరం కౌంటర్ నెరేటివ్‌ను నడుపుతోంది. జగన్ మావిగన్ ప్రతిపాదన తెచ్చారు. మావిగన్‌లో మ అంటే మచిలిపట్నం, మిగతా రెండు విజయవాడ, గుంటూరు. ఇప్పుడు చంద్రబాబు చెప్పిన దాంట్లో మచిలీపట్నం లేదు. మిగతా అంతా సేమ్.  మాది విజన్, మీది కేవలం 29 గ్రామాల రియల్ ఎస్టేట్ మోడల్ అని చిత్రీకరించే ప్రయత్నం చేయడం ద్వారా రాజధానిపై ప్రజల్లో గందరగోళం సృష్టించడమే వైఎస్సార్సీపీ ప్రధాన రాజకీయ వ్యూహంగా మారింది. దీనికి  చెక్ పెడుతూనే, సాధారణ ప్రజల్లో ఉన్న సంకోచాలను తొలగించేందుకు చంద్రబాబు ఈ త్రివేణీ సంగమం  ఫార్ములాను తెరపైకి తెచ్చారు. కేవలం 29 గ్రామాలలోని కోర్ క్యాపిటల్ ఏరియానే రాజధానిగా ప్రచారం కావడం వల్ల రాయలసీమ, ఉత్తరాంధ్ర లేదా పల్నాడు ప్రజల్లో  ఇది అందరి రాజధాని కాదు అనే భావన కలిగే ప్రమాదం ఉంది. అందుకే, విజయవాడ, గుంటూరు నగరాల ఆర్థిక వ్యవస్థను, మౌలిక వసతులను అమరావతితో ఐక్యపరిచి, 80 లక్షలకు పైగా జనాభాను కవర్ చేసే ఒక విశ్వనగరంగా డెవలప్ చేస్తామని చెప్పడం ద్వారా ఈ ప్రాజెక్టుకు ప్రాంతీయ ఆమోదాన్ని పెంచాలని ప్రభుత్వం భావిస్తోంది.

### పనుల్లో శరవేగం

రూ.50,999 కోట్ల విలువైన 95 మౌలిక వసతుల ప్రాజెక్టులతో అమరావతిలో పనులు పునఃప్రారంభమైన వేళ, ప్రతినెల కనీసం 7.92 శాతం పురోగతి సాధించాలని చంద్రబాబు క్షేత్రస్థాయి అధికారులకు నిర్దేశించిన గడువు కేవలం నిర్మాణ వేగాన్ని సూచించడమే కాకుండా పనులను వేగవంతం చేసి  స్పీడ్, క్వాలిటీ, డెలివరీ  సూత్రంతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలనే పట్టుదలను ప్రతిబింబిస్తోంది. ప్రతిపక్షాలు ఇది సాధ్యం కాని కల, కేవలం భూముల ప్రకటనలు మాత్రమే అని విమర్శిస్తుండగా, ప్రభుత్వం మాత్రం  ఇది అమరావతి విజన్ 2.0  అని గట్టిగా నమ్ముతోంది.

### అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదా.?

మరోవైపు, వైఎస్సార్సీపీ ఈ పరిణామాలను తమకు అనుకూలంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. జగన్ చెప్పిన మావిగన్ రూట్‌లోకే చంద్రబాబు వస్తున్నారని జగన్ విజనరీ అంటున్నారు.  ఇప్పుడు అమరావతి అంటే 29 గ్రామాలు కాదని, విజయవాడ–గుంటూరుతో పాటు  మచిలీపట్నాన్ని కూడా  కలపాల్సిందే అని వైసీపీ సోషల్ మీడియా విభాగాలు ప్రచారం వేగవంతం చేశాయి. అంటే ఎలా చూసినా అమరావతి, మావిగన్‌కు పెద్ద తేడా లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.  సీఆర్డీఏ గ్రామీణ పరిధులను, మచిలీపట్నం పోర్ట్ కనెక్టివిటీని తెరపైకి తెస్తూ అమరావతి నిర్మాణంలో జాప్యాన్ని కప్పిపుచ్చుకోవడానికే చంద్రబాబు ఈ కొత్త మెట్రోపాలిటన్ డెఫినిషన్‌ను తెరపైకి తెచ్చారనేది వైసీపీ ప్రధాన ఆరోపణ.  రాజధాని అమరావతి ప్రాంతం కేవలం భౌగోళిక నిర్మాణం కాక ఏపీ భవిష్యత్ ఆర్థిక ఇంజిన్ కాబోతుందా లేదా రాజకీయ వివాదాల నిలయంగా మిగిలిపోతుందా అనేది రాబోయే రెండేళ్లలో పనుల పురోగతి పైనే ఆధారపడి ఉంటుంది.

# కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు చర్యలు

అందించేందుకు కొత్తగా నిర్మిస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలపై ఎక్కువ దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని, విత్తనాలను సబ్సిడీపై అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. రైతులు పండించిన పంటలను నేరుగా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులను నియమించి, సంబంధిత విభాగాల్లో రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.రాష్ట్రంలో ప్రస్తుత ఎల్నినో పరిస్థితుల ప్రభావం, అత్యవసర కార్యాచరణ ప్రణాళికపై నివేదికలో ప్రస్తావించిన కమిటీ ప్రభుత్వానికి పలు కీలక సూచనలు చేసింది. రాష్ట్రంలో తగినంత వర్షపాతం నమోదు కాకపోవడంతో వ్యవసాయంపై తీవ్ర ప్రభావం పడిందని కమిటీ తెలిపింది. ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులను ప్రోత్సహించాలని సూచించింది. గ్రామాల వారీగా అత్యవసర ప్రణాళికలు రూపొందించి పప్పు ధాన్యాలు, నూనె గింజలు, చిరు ధాన్యాలు, కూరగాయల పంటలను ప్రోత్సహించాలని తెలిపింది. ఈ పంటలకు 75శాతం సబ్సిడీతో విత్తనాలను అందించాలని, ప్రత్యామ్నాయ పంటలకు కొత్త రుణాలు మంజూరు చేయాలని కమిటీ సూచించింది.గతేడాది ఈ సీజన్లో 79.49 లక్షల ఎకరాలు సాగు చేయగా ఈ ఏడాది 74.56 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయని నిపుణుల కమిటీ తెలిపింది. పత్తి పంట 45 లక్షల ఎకరాలు, సోయాబీన్ 3 లక్షల 62 వేల ఎకరాలు, వరి 14 లక్షల 92 వేల ఎకరాల్లో ప్రధాన పంటల సాగు ఉందని నివేదికలో పేర్కొంది. ఎల్నినో ప్రభావం నేపథ్యంలో 75 నుంచి 90శాతం సబ్సిడీ అందించి డ్రిప్, స్ప్రింక్లర్ సాగు పద్ధతులను ప్రోత్సహించాలని సూచించింది. సబ్సిడీ విత్తనాలు ఇచ్చి పశు గ్రాస సాగును ప్రోత్సహించాలని, సాగునీటి కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని తెలిపింది. వ్యవసాయ విశ్వవిద్యాలయాల శాస్త్రవేత్తల ద్వారా రైతులకు సాంకేతిక సూచనలు అందించాలంది.పంటలు, తాగునీరు, పశుగ్రాసం, విద్యుత్ సరఫరా, ప్రజారోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించేందుకు జిల్లా, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. కార్యాచరణ ప్రణాళిక అమలుకోసం సుమారు 803 కోట్ల నిధులు అవసరమవుతాయని కమిటీ అంచనా వేసింది. మూడు రోజులుగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు ఆరుతడి పంటలు సాగు చేసిన రైతులకు ఊరటనిచ్చాయని నిపుణుల కమిటీ ఛైర్మన్ చిన్నారెడ్డి తెలిపారు. ఈ వర్షాలతో లభించిన తేమ, అందుబాటులోకి వచ్చిన నీటిని సమర్థవంతంగా వినియోగించుకొని ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటలను విజయవంతంగా సాగు చేసుకునేలా ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్లు పథకంపై వదంతులు నమ్మొద్దు



ఈ మేరకు తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ వీపీ గౌతమ్ ఒక వీడియోను విడుదల చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమేనని ఆయన చెప్పారు. ముఖ్యంగా కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసినా ఇప్పటికే పొందుతున్న ఇతర సంక్షేమ పథకాలపై ఎలాంటి ప్రభావం ఉండదని తేల్చి చెప్పారు. పింఛన్లు, రేషన్, ఇతర ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. ప్రజల్లో అయోమయం సృష్టించేలా సోషల్ మీడియాలో కొందరు కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. అలాంటి అబద్ధపు ప్రచారాన్ని నమ్మవద్దని అధికారిక ప్రకటనలను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇక క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన ప్రభుత్వ స్థలాల వివరాలను అధికారులు సీఎంకు వివరించారు. పోలీసు, రెవెన్యూ, రవాణా శాఖలకు చెందిన వినియోగంలో లేని భూములను ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి వినియోగించాలని, సంబంధిత శాఖలకు ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయించాలని సీఎం ఆదేశించారు. జనావాసాలకు దూరంగా ఇళ్లను నిర్మిస్తే ఉపాధి, ఉద్యోగ అవకాశాలపై ప్రభావం పడే అవకాశం ఉందని అభిప్రాయపడిన సీఎం రేవంత్ రెడ్డి అందుకే నగరానికి దగ్గరగా, నగరవాసులు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల పరిధిలోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని అధికారులకు సూచించారు. దీంతో లబ్ధిదారులు జీవనోపాధిని కోల్పోకుండా ఉంటారని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికల ప్రకారం ఒక్కో ఫ్లాట్ 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనున్నారు. ఒక్కో ఇంటి నిర్మాణ వ్యయం సుమారు రూ.11 లక్షలు కానుండగా అందులో రూ.5 లక్షలను ప్రభుత్వం సబ్సిడీగా అందిస్తుంది. మిగిలిన రూ.6 లక్షలను లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. ఇక భూమి కొనుగోలుకు అయ్యే మొత్తం ఖర్చును రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. తొలి దశలో క్యూర్ పరిధిలోని 17 నియోజకవర్గాల్లో 7,680 ఫ్లాట్ల నిర్మాణానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. రాజేంద్రనగర్, మహేశ్వరం, శేరిలింగంపల్లి, ఇబ్రహీంపట్నం, మల్కాజ్‌గిరి, నాంపల్లి, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, కార్వాన్, బహదూర్‌పురా, అంబర్‌పేట్, కూకట్‌పల్లి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, సనత్‌నగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్, మలక్‌పేట్ నియోజకవర్గాల్లో ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నారు.

# అప్పలరాజు కుటుంబంపై కూటమి కుట్ర

జగన్‌కు అనుమతి నిరాకరిస్తున్నట్టుగా జైలు అధికారులు తెలిపారు. అయితే అంపోలు జైలు వద్ద సీదిరి అప్పలరాజు కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు. సీదిరి అప్పలరాజు కుటుంబంపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు దిగుతుందని ఆరోపించారు. ఒక దురదృష్టకరమైన రోడ్డు ప్రమాదాన్ని కావాలనే హత్య కేసుగా మార్చి, 18 ఏళ్ల యువకుడితో పాటు మొత్తం కుటుంబాన్ని వేధించడం అమానుషమని అన్నారు. సీదిరి అప్పలరాజు కుటుంబాన్ని వేధించడం రాష్ట్రంలో జరుగుతున్న కక్షసాధింపు రాజకీయాలకు పరాకాష్ట అని విమర్శించారు. నెల రోజుల క్రితమే నీట్ పరీక్ష రాసి, తండ్రిలాగే మంచి డాక్టర్ కావాలని కలలు కంటున్న 18 ఏళ్ల యువకుడిని హత్య కేసులో ఇరికించి అతని జీవితాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. బాధితుడితో ఎలాంటి పరిచయం కూడా లేని ఒక యువకుడిపై కుట్ర, హత్య ఆరోపణలు మోపడం వెనుక రాజకీయ కక్ష తప్ప మరొకటి కనిపించడం లేదని అన్నారు.

యాక్సిడెంట్ జరిగిన వెంటనే 108కు ఫోన్ చేసింది కూడా అదే యువకుడని, బాధితుడిని కాపాడేందుకు అతడి తండ్రి నుంచి నేర్చుకున్న సీపీఆర్ కూడా చేశాడని జగన్ చెప్పారు. ఏదైనా చెడు ఉద్దేశం ఉంటే ఒక వ్యక్తిని కాపాడేందుకు ఇంత ప్రయత్నం ఎందుకు చేస్తారని ప్రశ్నించారు. ప్రమాదంలో మరణం జరిగితే బాధిత కుటుంబానికి అండగా నిలిచి న్యాయం చేయాల్సింది పోయి, దానిని రాజకీయాలకు వాడుకోవడం దుర్మార్గమని విమర్శించారు.ఇటువంటి చర్యలు చరిత్రలో కక్షసాధింపు రాజకీయాలకు ఉదాహరణగా నిలిచిపోతాయని వైఎస్ జగన్ అన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ ఘటనపై ఆలోచించాలని పిలుపునిచ్చారు. అప్పలరాజు కుటుంబాన్ని ఒంటరిగా వదిలిపెట్టబోమని, అన్ని విధాలుగా వైసీపీ అండగా ఉంటుందని జగన్ చెప్పారు. న్యాయస్థానాలపై పూర్తి విశ్వాసం ఉందని, న్యాయమే గెలుస్తుందని అప్పలరాజు త్వరలోనే బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు.

# మలక్‌పేట్ టీవీ టవర్‌కు కొత్త అవతారం

స్మార్ట్‌ఫోన్‌లలో టీవీ ఛానళ్లను వీక్షించే విధానాన్ని అమలు చేసేందుకు ఈ మలక్‌పేట్ టీవీ టవర్‌ను డిజిటల్ మొబైల్ బ్రాడ్‌కాస్టింగ్ కేంద్రంగా మారుస్తున్నారు. ప్రస్తుతం ఈ టెక్నాలజీ వ్యవస్థపై ప్రయోగాత్మక పరీక్షలు జరుపుతున్నారు. ఈ పరీక్షలు సక్సెస్ అయితే వచ్చే ఏడాదిలోనే హైదరాబాద్ ప్రజలకు ఈ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని దూరదర్శన్ కేంద్రం హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎన్‌వీ రమణ తెలిపారు. ఈ మొబైల్‌లో వచ్చే ఛానళ్లు పూర్తిగా ఉచితంగా ఉండే అవకాశాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు.ఈ కొత్త విధానంలో టీవీ ఛానళ్లు ఇంటర్నెట్ ఆధారంగా కాకుండా నేరుగా ప్రసార సంకేతాల రూపంలో మొబైల్ ఫోన్లకు చేరతాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. స్టూడియో నుంచి శాటిలైట్‌కు పంపించిన సిగ్నల్‌ను మలక్‌పేట్ టీవీ టవర్ స్వీకరించి అక్కడి నుంచి శక్తివంతమైన ట్రాన్స్‌మిటర్ల ద్వారా సుమారు 60 కిలోమీటర్ల పరిధిలోని మొబైల్ ఫోన్లకు ప్రసారం చేయనున్నారని కస్టమర్లు ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా ఈ ఛానళ్లను వీక్షించవచ్చని పేర్కొన్నాయి. మొదటి దశలో దూరదర్శన్‌కు చెందిన డీడీ యాదగిరి, డీడీ సప్తగిరి, డీడీ నేషనల్, డీడీ న్యూస్, డీడీ స్పోర్ట్స్‌తో పాటు ఇతర ప్రాంతీయ ఛానళ్లను అందుబాటులోకి తీసుకురానున్నారు. మరీ ముఖ్యంగా క్రీడా ప్రసారాలు ఈ మొబైల్ ప్లాట్‌ఫారమ్‌లో ప్రధాన ఆకర్షణగా మారే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. దేశంలో చాలా స్పోర్ట్స్ ఈవెంట్లకు సంబంధించిన ప్రసార హక్కులు దూరదర్శన్ వద్ద ఉండటంతో స్పోర్ట్స్ లవర్స్ ఇక ఇంటర్నెట్ అవసరం లేకుండానే మ్యాచ్‌లను ఫ్రీగా వీక్షించే అవకాశం లభించనుంది.భవిష్యత్తులో ప్రైవేట్ టీవీ ఛానళ్లను కూడా ఈ ప్లాట్‌ఫారమ్‌లో అనుమతించే అవకాశాన్ని సర్కార్ పరిశీలిస్తోంది. ఇందుకోసం వేలం విధానాన్ని అమలు చేసే అవకాశముందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్ట్ విజయవంతమైతే టెలివిజన్ ప్రసార రంగంలో కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టినట్టే అవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఒకప్పుడు యాంటెన్నాల ద్వారా ప్రతి ఇంటికి వినోదాన్ని అందించిన మలక్‌పేట్ టీవీ టవర్ ఇప్పుడు స్మార్ట్‌ఫోన్‌లకు నేరుగా టీవీ ప్రసారాలను అందించే సరికొత్త సాంకేతిక విప్లవానికి వేదికగా మారనుందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# పెల్లెట్ గన్స్ వాడకంపై మార్గదర్శకాలు అవసరం

ఆరోపణలను పరిశీలించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేసింది. అయితే పెల్లెట్ గన్స్‌పై పూర్తిస్థాయి నిషేధం కోరడం కాకుండా, వాటి వినియోగాన్ని అనుమతిస్తున్న పోలీసు నిబంధనలనే సవాల్ చేస్తూ పిటిషన్‌ను సవరించాలని పిటిషనర్లకు సూచించింది. గాయపడిన విద్యార్థులు, ఇతర బాధితులకు అవసరమైన వైద్య చికిత్స అందించాలని ఢిల్లీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. మాజీ ఇంటెలిజెన్స్ బ్యూరో ప్రత్యేక డైరెక్టర్ యశోవర్ధన్ ఆజాద్‌తో పాటు పెల్లెట్ గాయాలు అయ్యాయని చెప్పిన మరో ఇద్దరు ఈ పిటిషన్ దాఖలు చేశారు. వారి తరఫున న్యాయవాది వృందా గ్రోవర్ వాదనలు వినిపించారు. రబ్బరు, ప్లాస్టిక్ పెల్లెట్‌లకు, మెటాలిక్ పెల్లెట్‌లకు స్పష్టమైన తేడా ఉందని, ఈ కేసు పూర్తిగా మెటాలిక్ పెల్లెట్‌ల వాడకానికే సంబంధించినదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు.

గాయపడిన నిరసనకారుల వైద్య చికిత్స అంశంపైనా కోర్టు దృష్టి సారించింది. ఒక బాధితుడికి సరైన చికిత్స అందుతున్నా, మరో వ్యక్తికి సంబంధించిన వైద్య రికార్డులు ఆసుపత్రి ఇవ్వలేదని పిటిషనర్లు తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని సొలిసిటర్ జనరల్‌ను ధర్మాసనం ఆదేశించింది. అలాగే జులై 20న ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ విధుల రికార్డులు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి వినియోగానికి సంబంధించిన లాగ్‌లు, రిజిస్టర్లు భద్రపరచాలని కేంద్రాన్ని ఆదేశించింది. సంబంధిత రికార్డులన్నీ భద్రంగా ఉంచుతామని కేంద్రం కోర్టుకు హామీ ఇచ్చింది. విచారణ సందర్భంగా జస్టిస్ బాగ్చి కీలక వ్యాఖ్యలు చేశారు. అసాధారణ పరిస్థితుల్లో దశలవారీ బలప్రయోగంలో భాగంగా పెల్లెట్ గన్స్‌ను ఉపయోగించేందుకు పోలీసు నిబంధనలు అనుమతిస్తున్నాయని చెప్పారు. అలాంటి నిబంధనల చట్టబద్ధతను ప్రశ్నించకుండా నేరుగా నిషేధం కోరడం స్పష్టత లేని విజ్ఞప్తిగా కనిపిస్తోందన్నారు. అధిక బలప్రయోగం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో పెల్లెట్ గన్స్ వినియోగానికి స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలని కోరితే పరిశీలించవచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది.శాంతియుతంగా నిరసన తెలిపే విద్యార్థులపై హింసకు తావు ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అదే సమయంలో కొన్ని సందర్భాల్లో పరిస్థితులకు అనుగుణంగా దశలవారీ చర్యలు అవసరం కావచ్చని పేర్కొంది. పోలీసులు ప్రాణాంతక చర్యలకు వెళ్లాల్సిన అవసరం రాకుండా తగిన ప్రత్యామ్నాయ పరికరాలు, శిక్షణ కల్పించాలని వ్యాఖ్యానించింది. ఘటన జరిగిన సమయంలో పోలీసులు రక్షణ పరికరాలతో సిద్ధంగా ఉన్నారని, అక్కడి పరిస్థితులకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకున్నారని కేంద్రం తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు.

# పెద్దిని బతికించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం

కీలక అప్డేట్ ఇచ్చారు. పెద్దిని చూసేందుకు వచ్చిన నియోజకవర్గ ముఖ్యనేతలతో మాట్లాడిన ఆయన మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కేసీఆర్ ఆదేశాల మేరకు తాను స్వయంగా పర్యవేక్షిస్తూ అమెరికా వైద్యులను సైతం కాన్ఫరెన్స్ ద్వారా అడిగి తెలుసుకుంటున్నారని చెప్పారు. పరిస్థితి చెప్పలేని స్థితిలో ఉందని, తుది నిర్ణయం కుటుంబీకులు, వైద్యులు తీసుకుంటారన్నారు. అభిమానులు ఆసుపత్రికి రావొద్దని, ఇతర పేషెంట్లకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

'పెద్దిని బతికించుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నాం. అమెరికాకు కూడా రిపోర్ట్స్ పంపించాం. లండన్‌లోని టాప్ హాస్పిటల్స్, హైదరాబాద్‌లోని టాప్ డాక్టర్స్‌తో మాట్లాడాం. ప్రస్తుతం బీపీ మెయింటెన్ అవుతోంది. అస్వస్థతకు గురైన రోజు 30 –40 నిమిషాలు హార్ట్ ఆగిపోయింది. దీంతో మెదడుకు ఆక్సిజన్, రక్త ప్రసరణ నిలిచిపోయింది. జనరల్‌గా 5 నిమిషాలు బ్రెయిన్‌కు ఇవి అందకపోతే బ్రెయిన్ డెడ్ అవుతుందని డాక్టర్లు చెబుతున్నారు. ప్రస్తుతం మెదడుకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలు చేసి అమెరికా, లండన్ పంపించాం. అక్కడి డాక్టర్ల సూచనల మేరకు ట్రీట్మెంట్ జరుగుతోంది.ఆయనకు వచ్చింది హార్ట్ ఎటాక్ కాదు. లంగ్స్‌కు సంబంధించిన సమస్య. గత 20 రోజుల నుంచి హిమోగ్లోబిన్‌కు సంబంధించిన ట్యాబ్లెట్ వాడలేదు. దీంతో హిమోగ్లోబిన్ పర్సంటేజీ పెరిగి లంగ్స్ నుంచి హార్ట్‌కు పోయే వాల్వులో బ్లాక్ ఏర్పడింది. లంగ్స్ పనితీరు దెబ్బతింది. దాని ఎఫెక్ట్ గుండెపై పడింది. ఇది హార్ట్ ఎటాక్ కాదు ఊపిరితిత్తుల సమస్య. మానవ ప్రయత్నం చేస్తూనే ఉన్నాం. ప్రస్తుతం బెస్ట్ ట్రీట్మెంట్ జరుగుతోంది. హైదరాబాద్, బాంబే, అమెరికా, లండన్ డాక్టర్లతో మట్లాడి మన వల్ల ఏం చేయాలో అది చేస్తున్నాం.

కేసీఆర్ కూడా ప్రతి రోజూ డాక్టర్లతో మాట్లాడుతూనే ఉన్నారు. మేమంతా ఇక్కడే ఉండి మానిటర్ చేస్తున్నాం. ఇప్పటికిప్పుడు డాక్టర్లు ఏం చెప్పే పరిస్థితి లేదు. ప్రస్తుతం ప్రయత్నం కొనసాగుతోంది.ప్రతి రోజూ పెద్ది ఆరోగ్య పరిస్థితిపై కుటుంబసభ్యులకు డాక్టర్లు చెబుతూనే ఉన్నారు. ఏది ఏమైనా డాక్టర్లు, కుటుంబసభ్యులే నిర్ణయం తీసుకోవాలి. అంతే కానీ మనం తీసుకోలేం. మనకు అభిమానం, ప్రేమ ఉన్నా నిర్ణయం తీసుకోలేం. ఈరోజుకు ఉన్న పరిస్థితి ఇది. దయచేసి అభిమానులు ఎవరూ ఆసుపత్రికి రావొద్దు. ట్రీట్మెంట్‌కు ఇబ్బంది కలిగించొద్దు. ప్రతి రోజూ నేను హాస్పిటల్ వద్దనే ఉంటా, కేసీఆర్ నాకు అదే చెప్పారు. ప్రతిరోజూ మానిటర్ చేస్తూనే ఉంటాం. డాక్టర్లతో మాట్లాడి ఏం చేయాలో అది చేస్తున్నాం. కార్యకర్తలు ఈ పరిస్థితి అర్థం చేసుకొని హాస్పిటల్‌కు ఎవరూ రావొద్దని కోరుతున్నాం.' అని హరీష్ రావు వెల్లడించారు.

# ఆఫీసర్స్ బి కేర్ ఫుల్...

- అధికారులకు సెలవులు రద్దు, అత్యవసరమైతేనే సెలవులు పెట్టాలి
- అదిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి
- అధికారులందరూ అందుబాటులో ఉండాలి
- కలెక్టరేట్లో 9391942254 కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) అదిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని, అధికారులందరూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు.గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ సమావేశం జిల్లా అధికారులతో నిర్వహించారు.మండలాలవారిగా అదిక వర్షాలతో జరిగిన పరిస్థితులను స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో , స్పెషల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ... అదిక వర్షాల వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలందరూ అత్యవసరం ఉంటే తప్ప బయటకు రావాలన్నారు. అధికారులందరూ అందుబాటులో ఉండాలని, అత్యవసరం ఉంటే తప్ప అధికారులు సెలవులు పెట్టొద్దన్నారు.కలెక్టరేట్లో 9391942254 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు.ఎటువంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకూడదనీ,అత్యవసర పరిస్థితులలో ప్రజలను రక్షించేందుకు రోప్స్, డ్రోన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలనీ సూచించారు.చెరువులు, కల్వర్టులు, కుంటలలో నీరు ప్రవాహం రీచ్ అయ్యే అవకాశం ఉన్న దగ్గర సైన్ బోర్డులు పెట్టి చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ హాస్టల్స్ అంగన్వాడి సెంటర్స్, రూఫ్ లీకేజీ ఉన్నట్లయితే ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు.వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లలో ప్రజలకు నివాసం ఉండకుండా చర్యలు చేపట్టాలనీ అధికారులను ఆదేశించారు దూప్ సింగ్ తండా వర్షాలు అధికమై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తే ప్రజలకు రాకపోకలు ఇబ్బంది కలకుండా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలన్నారు.జిల్లా పంచాయతీ శాఖ ద్వారా సెక్రటరీలు ఎంపీవో లు సమన్వయంతో శానిటేషన్ పై ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ,నీరు నిల్వ ఉండు ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ ఫాగింగ్ నిర్వహించాలన్నారు.వర్షాలు అధికంగా కురుస్తున్నందు వల్ల విద్యుత్ ప్రమాదాల జరిగే అవకాశం ఉన్నందున తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.మెడికల్ ఆఫీసర్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా కృషి చేయాలన్నారు. అంటూ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.పాము కాటు, అంటువ్యాధుల , సీజనల్ వ్యాధుల మందులు అందుబాటులో ఉండాలని అధికారులు ఆదేశించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నాగేష్ జెడ్పిటిఓ ఎల్లయ్య జిల్లా అధికారులు, ఆర్డీవోలు ఎంపీడీవోలు తాసిల్దారు స్పెషల్ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల నేపథ్యంలో అధికారులు క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ గరిమ అగ్రవాల్

- కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో ఎలాంటి ఇబ్బందులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఆర్‌డబీ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.అధికారులు తమ పరిధిలోని ప్రాంతాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లు, భవనాలు, రహదారులు, లో లెవెల్ కల్వర్టులు తదితర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించే విధంగా యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

### కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

వర్షాల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో వరదలు, నష్టాల వివరాలపై సమాచారం అందించేందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేశామని, ఎక్కడైనా ఇబ్బందులు ఉన్నట్లయితే కంట్రోల్ రూమ్ నెంబర్ 9398684240 ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. టెలీ కాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జెడ్పీ సీఈవో వెంకట మాధవ రావు, సీపీఓ శ్రీనివాస చారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, డీపీఓ జయశీల, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్, పంచాయితీ రాజ్ ఈఈ సుదర్శన్, తదితరులు ఉన్నారు.

## మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు విస్తృత అవగాహన కార్యక్రమం



వేములవాడ(ప్రశ్న న్యూస్) పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలోని మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సౌందర్య మాట్లాడుతూ, మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన సామాజిక నేరమని, అమాయక మహిళలు, బాలికలు, చిన్నారులు, యువతను ఉద్యోగాలు, ఉన్నత విద్య, సినిమా అవకాశాలు, వివాహాలు, విదేశీ ఉద్యోగాలు వంటి పేర్లతో మోసగించి అక్రమంగా తరలించడం, బలవంతపు శ్రమ, లైంగిక దోపిడీ, బాల కార్మిక వ్యవస్థ, ఇతర దుర్వినియోగాలకు గురిచేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని వివరించారు. సోషల్ మీడియా, మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా అపరిచితులతో పరిచయాలు పెంచుకునేటప్పుడు అత్యంత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సంరక్షకులకు తెలియకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని, తెలియని వ్యక్తులు ఇచ్చే ఉద్యోగాలు లేదా ఇతర ఆఫర్లను పూర్తిగా పరిశీలించిన తర్వాత మాత్రమే స్పందించాలని తెలిపారు.అదేవిధంగా, ప్రతి విద్యార్థి తన వ్యక్తిగత వివరాలు, ఫోన్ నంబర్లు, ఆధార్ వివరాలు, ఫోటోలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోకూడదని అన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినా, బలవంతంగా ఎక్కడికైనా తీసుకెళ్లే ప్రయత్నం చేసినా లేదా మోసపూరితంగా ప్రలోభపెట్టే ప్రయత్నం చేసినా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పోలీసు శాఖ, సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా మానవ అక్రమ రవాణా నివారణకు సంబంధించి ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, బాధితులకు అందుబాటులో ఉన్న రక్షణ, పునరావాస సేవలు మరియు మహిళలు, చిన్నారుల భద్రత కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ – 1098 లేదా పోలీస్ –100 సేవల గురించి విద్యార్థులకు వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటేనే మానవ అక్రమ రవాణాను సమర్థవంతంగా అరికట్టవచ్చని, అనుమానాస్పద సంఘటనలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావడం ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ శేసికల , జిల్లా మహిళా కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ లు త్రివేణి, దేవిక గారు మరియు అర్చనలు సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ మమత గారు ,నషా ముక్తి భారత్ అభియాన్ కమ్యూనిటీ ఎడికేటర్ జనార్దన్ గారు, ప్రిన్సిపాల్ జ్యోతి గారు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### నిండు కుండలా కళకళలాడుతున్న

# కడెం ప్రాజెక్టు

**నిర్మల్** కడెం ప్రాజెక్టుకు భారీ వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి 21,048 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం (ఈఖీఒ) 700 అడుగులు కాగా, ప్రస్తుతం నీటిమట్టం 691 అడుగులకు చేరుకుంది. ఇదే స్థాయిలో వరద ప్రవాహం కొనసాగితే లేదా మరింత పెరిగితే, ప్రాజెక్టు స్పిల్వే గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం వుంది.

### గురుకుల డిగ్రీ కళాశాల నుంచి

## ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం

**మహబూబాబాద్** పట్టణం లోని తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల నుంచి ఇద్దరు విద్యార్థినుల అదృశ్యం అయ్యారు. దాంతో కళాశాల ప్రిన్సిపాల్ బిందు మాధవి పోలీసులకు ఫిర్యాదు చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా విచారణ చేపట్టారు. విద్యార్థినుల తల్లిదండ్రులు అందోళనలో వున్నారు.

# మృతుడు డిజిల్ దొంగ

**అనంతపురం** గుత్తి – తాడిపత్రి హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని తెలంగాణ వాసిగా పోలీసులు గుర్తించారు. డీజిల్ దొంగల ముఠా కు చెందిన కారు వేగంగా లారీని ఢీ కొనడం తో ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో మంటలు చెలరేగాయి. వెంటనే ఇద్దరు కారు నుంచి బయటకు దూకేసినట్లు పోలీసులు వెల్లడించారు. కారులో చిక్కుకున్న డీజిల్ దొంగ సజీవదహనం అయ్యాడు. వీరంతా తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా మరికల్ మండలం బుడేగాన్ తాండాకు చెందిన వారిగా గుర్తింపచారు.

## ఝార్ఖండ్ బొగ్గు మాఫియాపై ఈడీ ఉక్కుపాదం

**ధన్ బాద్** అక్రమ బొగ్గు తవ్వకాలు, మనీలాండరింగ్ ఆరోపణలపై ధన్బాద్ జిల్లాలోని 25 చోట్ల ఈడీ ఏకకాలంలో భారీ సోదాలు నిర్వహించింది. ఈ సోదాల్లో భారీ మొత్తంలో నగదు, ఆస్తుల పత్రాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక రికార్డులను ఈడీ స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. దర్యాప్తులో భాగంగా సుమారు రూ.600 కోట్ల విలువైన ఆస్తులు, పెట్టుబడులను గుర్తించిన ఈడీ.. వాటిని ఫ్రీజ్ చేసినట్లు సమాచారం. దర్యాప్తులో అక్రమ బొగ్గు తవ్వకాల ద్వారా వచ్చిన నిధుల జాడను గుర్తించి, వాటి నెట్వర్క్ను ఛేదించడంపై ఈడీ దృష్టి సారించింది

## క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి పునాది

- డీజీపీ సి.వి. ఆనంద్

గచ్చిబౌలిలోని ఇండోర్ స్టేడియంలో 11వ ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ ఛాంపియన్‌షిప్ ఘనంగా ముగిసింది. దేశంలోని వివిధ పోలీసు బలగాలకు చెందిన క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.వి. ఆనంద్ విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ, దేశంలోని వివిధ పోలీసు బలగాలు ఒకే వేదికపై కలుసుకోవడం జాతీయ ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ఇటువంటి పోటీలు పరస్పర అవగాహనను పెంపొందించడంతో పాటు స్నేహపూర్వక వాతావరణాన్ని సృష్టిస్తాయని పేర్కొన్నారు.క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని, జూడో, కరాటే, తైక్వాండో వంటి మార్షల్ ఆర్ట్స్ ఆత్మ నియంత్రణ, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ చిన్ననాటి నుంచే క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.తాను కూడా విద్యార్థి దశ నుంచే క్రీడాకారుడినేనని, పోలీసు అకాడమీలో శిక్షణ సమయంలోనూ, అనంతరం సేవలోనూ క్రికెట్, టెన్నిస్ వంటి క్రీడల్లో చురుకుగా పాల్గొన్నానని డీజీపీ గుర్తు చేసుకున్నారు. క్రికెట్ తనకు అత్యంత ఇష్టమైన క్రీడ అని, సహచరులతో కలిసి మూడు ఛాంపియన్‌షిప్‌లు గెలిచిన అనుభవం ఉందన్నారు.2019లో ఇతిబట పనిచేసిన సమయంలో ఆ సంస్థకు లభించిన ఏకైక ట్రోఫీని తమ జట్టు సాధించిందని, అలాగే రెండు సంవత్సరాల క్రితం బెంగళూరులో జరిగిన పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు నాయకత్వం వహించిన విషయాన్ని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాను ఉద్దేశించి తెలంగాణలో మరిన్ని జాతీయ స్థాయి క్రికెట్, టెన్నిస్ టోర్నమెంట్లు నిర్వహించేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశం ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో మరిన్ని పతకాలు సాధించే దిశగా యువతను ప్రోత్సహించాలని, ప్రధానమంత్రి ప్రారంభించిన ఖేలో ఇండియా కార్యక్రమం ద్వారా క్రీడలకు విశేష ప్రోత్సాహం లభిస్తోందన్నారు.ప్రతి ఒక్కరూ క్రీడలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని, ఉద్యోగ జీవితంలోనే కాదు పదవీ విరమణ అనంతరం కూడా ఆరోగ్యకరమైన జీవనశైలిని కొనసాగించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని డీజీపీ సూచించారు.ఈ ఛాంపియన్‌షిప్ విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన నిర్వాహకులు, రిఫరీలు, టెక్నికల్ సిబ్బంది, స్వచ్ఛంద సేవకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ నిర్వహణకు తెలంగాణ పోలీసును వేదికగా ఎంపిక చేయడం గర్వకారణమని పేర్కొన్నారు.

### మెగా డీఎస్సీ పరీక్షల అవినీతిపై

## నారా లోకేష్ తక్షణం రాజీనామా చేయాల్సిందే

వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి డిమాండ్



**పోరుమామిళ్ల(బి. కోడూరు )** నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారానికి భాధ్యత వహించి కేంద్ర విద్యాశాఖ మంత్రి దరేంద్ర ప్రధాన్ రాజీనామా చేసినట్లు నీతి,నిజాయితీ,నిబద్ధత ఉంటే మెగా డీఎస్సీ పరీక్షల నిర్వాహణలో జరిగిన అవినీతి,అక్రమాలకు భాధ్యత వహిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖమంత్రి నారా లోకేష్ రాజీనామాచేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రచార కమిటీ సంయుక్త కార్యదర్శి చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎస్సీ నియామక ప్రక్రియలో ముఖ్యంగా. నాలుగో తరగతి నుండి పదో తరగతి వరకు. నాలుగు సంవత్సరాలు ఎక్కడైతే చదువుతారో వారి కి. వారి జిల్లాలలో లోకల్ అభ్యర్థులుగా పరిగణలోకి తీసుకుంటారు. కానీ డీఈవో స్థాయి నుంచి. ఎంఈఓ స్థాయి వరకు నివేదిక తీసుకోకపోవడం వలన. చాలామంది డిఈఓ లు అమ్ముడుపోయారని . అందుకే ఇలాంటి తప్పులు ఎన్నో జరిగాయని. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎంపికైన అభ్యర్థులను చాలామంది . అభ్యర్థులు 1.నాన్ లోకల్ అభ్యర్థులు దొంగ లోకల్ సర్టిఫికెట్లు సృష్టించారని.2 పీహెచ్ కోటాలో. హెచ్. ఐ. కోటాలో చెవుడు దొంగ సర్టిఫికెట్లు 3. ఈడబ్ల్యూఎస్ దొంగ సర్టిఫికెట్లు.4 స్పోర్ట్స్ కోట దొంగ సర్టిఫికెట్లు. ఈ నాలుగు అంశాలను ప్రభుత్వం ఎలా మర్చిపోయిందని ఆయన ప్రభుత్వాన్ని నిలదీశారు. అనేక అక్రమాలు,అవకతవకలు జరిగిన నేపథ్యంలో అభ్యర్థుల్లో తీవ్ర ఆందోళన నెలకొందని అయినా దానిని కనీసం పరిగణలోనికి తీసుకోకుండా. నారా లోకేష్ రి ఎంక్వయిరీ చేయిస్తే దొంగలు బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిజమైన లబ్ధిదారులు న్యాయం జరుగుతుందని కానీ నారా లోకేష్ పట్టీ పట్టనట్టుగా వ్యవహరించడం ఉన్నత విలువలకు కోల్పోయాడని ఆయన శాఖలో ఇంత అవినీతి జరుగుతూ ఉంటే ఏ మాత్రం స్పందించకుండా తాను నిర్వహించిన మెగా డీఎస్సీ తప్పులు కప్పిపుంచడం అతి దారుణమైన చర్యని విద్యార్థుల ప్రాణాలతో చలగాటమాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణం రాజీనామా చేసి తన చిత్తశుద్ధిని, నైతిక విలువలను కాపాడు కోవాలని.అనంతరం డిఎస్సీ నియామకాల్లో జరిగిన లోపాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర విద్యామంత్రి దరేంద్ర ప్రధాన్ రాజీనామా ఎన్డీఏ కూటమి ప్రభుత్వా నైతిక విలువలకు అద్దం పడుతోనీదన్నారు. అదే కూటమి లో బాగస్వామిగా ఉన్న రాష్ట్ర విద్యా మంత్రి నారాలోకేష్ రాజీనామా చేసి నైతిక విలువలను పరిరక్షిస్తారా. పదవే ముఖ్యమని బావించి అంటిపెట్టు కుని ఉంటారో. చెప్పాలని, దీనిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వైఖరిని రాష్ట్ర ప్రజలకు, నిరుద్యోగులకు వెల్లడించాలని ఆమన డిమాండ్ చేశారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని నమ్మిన నిరుద్యోగులు చంద్రబాబు వస్తే దొంగలకు ఉద్యోగాలు వస్తున్నాయంటే దీనికి మెగా డీఎస్సీ నిదర్శనం. ఎన్నికల ముందు, ఎన్నికల అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, కూటమి నేతలు నమ్మబలికారని, ప్రజలను విద్యార్థులను మోసం చేశారని చిత్తశుద్ధి ఉంటే చంద్రబాబు నాయుడు సిబిఐ ద్వారా విచారణ చేపట్టి అవకతవకలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని. తన కుమారుడిని మంత్రి పదవి నుంచి తొలగించాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఆదా మారిస్తే అంతే అధోగతి

- ప్రమాదాలకు నిలయంగా మారిన రోడ్డు



**కౌతాళం,** మండలంలోని ఉరుకుందకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని అధ్వానంగా మారింది. రోడ్డంతా భారీ గుంతలతో నిండిపోవడంతో పాదాచారులు పొలాలకు వెళ్లే రైతన్నలు మరియు వాహనదారులు , తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో వాటి లోతు కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఉరుకుంద శ్రీ ఈరన్న స్వామి దేవస్థానానికి నిత్యం వేలాది మంది భక్తులు ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. రహదారి దుస్థితి కారణంగా ద్విచక్ర వాహనదారులు, రైతులు, ఆటో, బస్సు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో అంబులెన్స్ సేవలు కూడా వేగంగా చేరుకోవడం కష్టమవుతోందని ప్రజలు చెబుతున్నారు.భక్తులు, గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు వెంటనే రహదారికి మరమ్మతులు చేపట్టి శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.

## గుడి చెరువు బండ్ పార్క్ ప్రారంభం



**రాజన్న సిరిసిల్ల** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువులో రూ. 12 కోట్ల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే ప్రారంభించారు. ఈ సందర్భంగా నటరాజ విగ్రహం, సప్త మాతృకల విగ్రహాలు, గార్డెన్, మొక్కలు, భారీ శివుడి విగ్రహాన్ని వారు పరిశీలించారు

### కోడుమూరును అన్ని రంగాల్లో

## అగ్రగామిగా నిలబెడతా

- ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి



**సి. బెళగల్** కోడుమూరును అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెడతానని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెండేళ్ల నమ్మకం,సంక్షేమ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా, నాలుగవ రోజు డోర్ టు డోర్ కార్యక్రమాన్ని, మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, ఎన్నికల పరిశీలకులు వి.వెంకట్,ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కొండపురం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాల సిబ్బంది, ఘన స్వాగతం పలికారు. అనంతరం గ్రామంలో గల ప్రతి ఇంటికి వెళ్లి రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం చేసిన, అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను అందించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలకు ప్రజలు ఆకర్షితులయ్యారని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ చంద్రశేఖర్, సింగిల్ విండో చైర్మన్ బోయ చిన్న తిమ్మప్ప, తెలుగు యువత అధ్యక్షులు కొత్తకోట హరికృష్ణ, గ్రామ నాయకులు,శంకర్ బాబు రెడ్డి, రఘునాథ్ రెడ్డి, తదితర తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు కార్యకర్తలు పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారు.

## ప్రజలకు నిష్పాక్షికంగా సేవలు అందించాలి

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, వార్షిక తనిఖీల్లో భాగంగా మహాదేవ్పూర్ పోలీస్ స్టేషన్ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు., అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్లైన్లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ గారు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్లైన్లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.అదేవిధంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ విధానాన్ని పరిశీలించి, అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేస్తూ నిర్వహించాలని ఆదేశించారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించి, వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ప్రతి పౌరుడికి స్నేహపూర్వక వాతావరణం కల్పిస్తూ, వారి సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించే విధంగా సేవలు అందించాలని అధికారులు, సిబ్బందికి ఎస్పీ ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ తనిఖీలలో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్పూర్ సీఐ వెంకటేశ్వర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

# నీట్ లీక్‌పై యూత్ కాంగ్రెస్ ఆగ్రహం

## మోదీ, అమిత్‌షా రాజీనామా చేయాలి

- విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన యూత్ కాంగ్రెస్.
- లక్షల మంది భవిష్యత్తుతో చెలగాటం: కేంద్రంపై యూత్ కాంగ్రెస్ ఫైర్




**ఏటూరునాగారం (ప్రశ్న న్యూస్)** నీట్ పేపర్ లీకేజ్ ఘటన, ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జ్‌ను నిరసిస్తూ ఏటూరునాగారంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ జరిగిందని ఆరోపిస్తూ, ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గంట కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏటూరునాగారం వై జంక్షన్ వద్ద యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఆర్టీఏ మెంబర్ వసంత శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సర్వా అక్షిత్ మాట్లాడుతూ, "కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసింది. పేపర్ లీక్‌లతో లక్షల మంది విద్యార్థుల కలలను కాలరాసింది. నిజ నిర్ధారణ కమిటీ వేసి బాధ్యులను శిక్షించకుండా విద్యార్థుల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోంది. ఇది సహించేది లేదు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏటూరు నాగారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంటా క్రిష్ణ రెడ్డి మాట్లాడుతూ నీట్ పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడిందని ఆరోపించారు. తమ హక్కుల కోసం శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ఈ నిరసనలో యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ విద్యార్థులకు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు ముస్తఫా. మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సర్వ సాయితేజ, ప్రశాంత్, టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కర్ల తరుణ్. కళ్యాణ్, వేణు. మని, సిద్దు, వంశీ. సద్దాం, దినేష్. సర్వ అక్షిత్ కుమార్, పోలాబోయిన గోపాల్, అఖిల్ అఫ్రిది, సాయి, వినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్ల తొలగింపు డిమాండ్ వెనుక కుట్ర ఉంది

- మాదిగ జాగృతి సంఘం ఆగ్రహం
- అంబెడ్కర్ రాజ్యాంగంపై దాడి సహించం, 90% ప్రజలు ఏకం కావాలి: సాంబశివన్
- కుల వివక్షపై మాట్లాడకుండా రిజర్వేషన్లపై చర్చ వద్దు



ములుగు (ప్రశ్న న్యూస్) రిజర్వేషన్లను తొలగించాలన్న డిమాండ్ ఈ దేశంలోని అగ్రవర్ణాల కుట్రలో భాగమని మాదిగ జాగృతి సంఘం రాష్ట్ర నాయకుడు సాంబశివన్ ఆరోపించారు. గురు వారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో, దేశ జనాభాలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలు ఇప్పుడు రాజకీయ, సామాజిక చైతన్యంతో ఉన్నాయని, ఇలాంటి కుట్రలను తిప్పికొట్టే స్థాయికి ఎదిగాయని స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఈ దేశంలోని సంపద, విద్య, అధికారం అంతా కొద్ది మంది చేతుల్లోనే కేంద్రీకృతమై ఉంది. దేశ వనరులను దోచుకుని అత్యంత సంపన్నులుగా మారిన వారే ఇప్పుడు రిజర్వేషన్లు వద్దని నినదిస్తున్నారు. అదే సమయంలో ఆర్థిక ప్రాతిపదికన 10 శాతం రిజర్వేషన్లు తీసుకుంటున్నారు. ఇది ద్వంద్వ ప్రమాణం కాదా" అని ప్రశ్నించారు. రిజర్వేషన్లను వ్యతిరేకించే ముందు ముందుగా దేశంలో ఉన్న కుల వివక్షను తొలగించాలని, భూమి, విద్య, ఆస్తులను అందరికీ సమానంగా పంచాలని సాంబశివన్ డిమాండ్ చేశారు. "అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, సమాన గౌరవం లభిస్తే రాజ్యాంగం 100 శాతం అమలైనట్టే. అప్పుడు ఎవరికీ రిజర్వేషన్ల అవసరం ఉండదు" అని అన్నారు. ఇది కేవలం రిజర్వేషన్ల సమస్య మాత్రమే కాదని, రాజ్యాంగాన్ని దశలవారీగా దెబ్బతీయాలన్న పెద్ద ఎజెండాలో ఇది ఒక భాగమని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా ద్వారా కొందరు యువకులను రెచ్చగొట్టి రిజర్వేషన్లపై వ్యతిరేక ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. రిజర్వేషన్లు, రాజ్యాంగం జోలికి ఎవరైనా వస్తే దేశంలోని 90 శాతం అణగారిన వర్గాల ప్రజలు ఏకమై ఢిల్లీ జంతర్ మంతర్ తరహాలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని సాంబశివన్ హెచ్చరించారు. వెనుకబడిన వర్గాల హక్కుల పరిరక్షణ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని ఆయన స్పష్టం చేశారు.

# పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి.

- యశోద ఆసుపత్రిలో పరామర్శ.. కుటుంబ సభ్యులకు ధైర్యం.




**మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ )** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అనారోగ్యంతో యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్ రెడ్డి గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితినివైద్యులనుఅడిగితెలుసుకున్నారు. అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. భగవంతుని ఆశీస్సులతో పెద్ది సుదర్శన్ రెడ్డి త్వరలోనే పూర్తిగా కోలుకుని ప్రజాసేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ వారికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వీరి వెంట మెదక్ జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు ఎం. లావణ్య రెడ్డి తదితరులు ఉన్నారు.

# ఘట్కేసర్ గురుకులంలో అధ్వానంగా విద్యార్థినిల దుస్థితి

- ఇది అభివృద్ధేనా.. ఆడబిడ్డల కన్నీళ్లకు జవాబేది.?
- అధ్వానంగా వాష్‌రూమ్‌లు, కనీస పారిశుధ్యం కరువు,
- విద్యార్థినులకు తీవ్ర యూరిన్ ఇన్ఫెక్షన్లు
- గర్ల్స్ కాలేజీ ఆవరణలో బీడీలు, సిగరెట్లు, గంజాయి ముఠాల సిట్టింగ్స్, భయంలో విద్యార్థినులు
- ఏడాదిగా వాష్‌రూమ్స్ కడగని వైనం, నీళ్లు, బకెట్లు లేక అల్లాడుతున్న బాలికలు
- పట్టించుకోని ప్రిన్సిపాల్, అధ్యాపకులు, గత విద్యాసంవత్సరం ఫలితాలు పూర్తిగా శూన్యం (జీరో)











**ఘట్కేసర్ (ప్రశ్న న్యూస్)** నా బిడ్డ బాగా చదవాలి... సురక్షితంగా తిరిగి ఇంటికి రావాలి" అని ప్రతి తల్లిదండ్రులు తన కూతురిని గురుకుల్‌కు పంపేటప్పుడు కోరుకుంటుంది. కానీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్‌లోని శ్రీ గురుకుల జూనియర్ కళాశాల (ఎయిడెడ్) లో నేడు నెలకొన్న సమస్యలు చూస్తుంటే ప్రతి తల్లిదండ్రి గుండెల్లో భయం నిండుతోంది. ఈ రోజు ఒక ఆడబిడ్డ కన్నీరు కారిస్తే, రేపు అది మన ఇంటి బిడ్డ కూడా కావచ్చు అన్న బాధ్యత ప్రిన్సిపాల్ కు లేకపోవడం చూస్తుంటే ఉన్నత అధికారులు నిద్రపోతున్నారా అనిపిస్తోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### పిచ్చిమొక్కల నడుమ వాష్‌రూమ్‌లు.. ఏడాదిగా శుభ్రం చేయని వైనం..

గురుకులంలో కనీస మౌలిక వసతులు పూర్తిగా కరువయ్యాయి. కళాశాల ప్రాంగణంలో ఉన్న బాలికల వాష్‌రూమ్ పరిస్థితి అత్యంత దారుణంగా తయారైంది. పిచ్చి మొక్కలు, ముళ్ల పొదల నడుమ, పరిశుభ్రతకు దూరంగా ఉన్న ఈ వాష్‌రూమ్‌లను గత ఏడాది కాలంగా కనీసం కడిగిన దాఖలాలు లేవు. లోపల నీటి సౌకర్యం కూడా లేకపోవడంతో తాగునీటి బబుల్ క్యాన్లను సగం కట్ చేసి పెట్టిన దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. పారిశుధ్య లోపం వల్ల ఇప్పటికే ఒక విద్యార్థిని మూడుసార్లు తీవ్రమైన 'యూరిన్ ఇన్ఫెక్షన్'కు గురై ఆసుపత్రి పాలైంది. ఈ విషయమై బాధిత విద్యార్థిని తల్లి ప్రిన్సిపాల్‌ను, ఆయాను నిలదీస్తే తీవ్ర నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల నుంచి వందలాది రూపాయలు వసూలు చేస్తున్న యాజమాన్యం, కనీసం ?30 పెట్టి ఫినాయిల్ డబ్బా తెచ్చి వాష్‌రూమ్‌లు శుభ్రం చేయించడం లేదని తల్లిదండ్రులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెట్ల నుండి వెళ్లాలంటే ఎక్కడ పాముల ఉంటాయో అని విద్యార్థినీలు భయానికి గురవుతున్నారు.

### బాలికల గురుకులంలో గంజాయి, సిగరెట్ ముఠాల హల్‌చల్

బాలికల గురుకుల కళాశాల అయినప్పటికీ ఇక్కడ సెక్యూర్టీ గార్డులు కానీ, సీసీ కెమెరాలు కానీ లేవు. కాలేజీ ప్రాంగణంలో, వాష్‌రూమ్ పరిసరాల్లో బీడీలు, సిగరెట్ ముక్కలు లభ్యమవుతుండటం తీవ్ర కలకలం రేపుతోంది.

సాయంత్రం, రాత్రి సమయాల్లో బయటి వ్యక్తులు, అకతాయిలు, మందుబాబులు, గంజాయి ముఠాలు కళాశాల ఆవరణలోని రౌండ్ పింక్ భవనం వద్ద "సిట్టింగ్స్" వేస్తున్నారని, క్రికెట్ ఆడటానికి వస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రిన్సిపాల్, పోలీసుల నిఘా పూర్తిగా కరువైందని విద్యార్థినిల నుండి ఆరోపణలు వస్తున్నాయి.

### చదువు సున్నా.. రిజల్ట్స్ నిల్

మరోవైపు కాలేజీలో విద్యాబోధన కూడా పూర్తిగా కుంటుపడింది. లెక్చరర్లు ఉన్నప్పటికీ క్లాసులు చెప్పకపోవడం, అసలు పట్టించుకోకపోవడంతో గత విద్యాసంవత్సరం ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో తరగతి మొత్తం (100%) ఫెయిల్ అయ్యారని (జీరో రిజల్ట్) తెలుస్తోంది. ఇంత జరుగుతున్న కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్ పట్టించుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తుంది. సమస్యను ప్రశ్నించిన విద్యార్థినులను, తల్లిదండ్రులను 'రేపు కాలేజీకి వస్తే చూస్తాం' అని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

### అభివృద్ధి అంటే ఏమిటి.?

రోడ్లు వేయడమా .? భవనాలు కట్టడమా.? ఫ్లెక్సీలు పెట్టడమా.? కాదు, ఒక ఆడబిడ్డ భయపడకుండా కాలేజీకి వెళ్లగలగడం. భయపడకుండా వాష్‌రూమ్‌కు వెళ్లగలగడం. భయపడకుండా నవ్వుతూ ఇంటికి చేరుకోవడం, అదే నిజమైన అభివృద్ధి అని విద్యార్థినీల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ అసలు సమస్యలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### తక్షణమే నిష్పక్షపాత విచారణ జరగాలి

ఘట్కేసర్ ప్రజలారా.. తల్లిదండ్రులారా.. ప్రజా ప్రతినిధులారా.. మౌనం సమస్యను పరిష్కరించదు, ప్రశ్నించడం నేరం కాదు, విద్యార్థుల భద్రతపై వచ్చిన తీవ్రమైన ఆరోపణలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే తక్షణమే స్పందించి నిష్పక్షపాత విచారణ జరిపించాలి. నిజాలు వెలుగులోకి తెచ్చి, పూర్తి బాధ్యతారాహిత్యంగా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రిన్సిపాల్, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకొని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రతి విద్యార్థికి సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించి, ఆడబిడ్డ భద్రతపై రాజీ పడకుండా సమస్యలు తీరేవరకు ప్రతి ఒక్కరూ పోరాటం చేయవలసిన సమయం వచ్చిందని వెంటనే సమస్యలు తీర్చని పక్షంలో భావిస్థాయిలో ఆందోళన చేస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# మాటల్లో కాదు చేతల్లో అభివృద్ధి

- మంథని అభివృద్ధికి చిరునామా మంత్రి శ్రీధర్ బాబు
- మంథని బస్సు డిపో నుండి మల్లేపల్లి డిగ్రీ కాలేజ్ వరక 80 పిట్ల రోడ్డు వెడల్పు
- కూచిరాజు పల్లి లో .ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్. నిర్మాణానికి భూమిపూజ
- గోదావరి నది తీర ప్రాంతంలో మహాప్రస్థానం నిర్మాణానికి భూమిపూజ
- ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న కోఆపరేటివ్ బ్యాంకు
- హెచ్.పీ బంక్ పక్కనుండి అయ్యప్ప దేవాలయం వరకు రోడ్డు పూర్తయింది
- బస్సు డిపో నుండి గోదావరి నది వరకు ఫోర్ లైన్స్ రోడ్డు వెడల్పు





**మంథని( ప్రశ్న న్యూస్)** ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని మంత్రి శ్రీధర్ బాబు మంథని నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. రహదారులు, విద్య, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకింగ్, ప్రజా సౌకర్యాలు, శ్మశాన వాటికల అభివృద్ధి వంటి అనేక రంగాల్లో వరుసగా పనులు చేపట్టడంతో మంథని రూపురేఖలు మారుతున్నాయి.

### చేపట్టిన ముఖ్య అభివృద్ధి పనులు:

డిపో నుండి మల్లేపల్లి డిగ్రీ కళాశాల వరకు 80 అడుగుల వెడల్పు రహదారి నిర్మాణానికి చర్యలు. కూచిరాజుపల్లిలో ఆర్ అండ్ బి అతిథి గృహం నిర్మాణానికి భూమిపూజకు సన్నాహాలు. కూచిరాజుపల్లిలోనే నూతన పాఠశాల భవనం నిర్మాణానికి భూమిపూజకు ఏర్పాట్లు. గోదావరి నది సమీపంలో మహాప్రస్థానం నిర్మాణానికి భూమిపూజకు సిద్ధంగా ఉంది. మంథని నుండి గోదావరి నది వరకు ఫోర్‌లైన్ రహదారి విస్తరణ కార్యక్రమానికి శ్రీకారం. ప్రజలకు మరింత మెరుగైన బ్యాంకింగ్ సేవల కోసం సహకార బ్యాంకు ప్రారంభోత్సవానికి సిద్ధం. హెచ్‌బీ బంకు పక్కన నుంచి బస్సు డిపో వరకు రహదారి అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. మంత్రి శ్రీధర్ బాబు అభివృద్ధిని రాజకీయాలకే పరిమితం చేయకుండా ప్రజల అవసరాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్తున్నారని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్య, రవాణా, ప్రభుత్వ సేవలు, ప్రజా సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల మంథని అభివృద్ధి దిశగా వేగంగా అడుగులు వేస్తోందని ప్రజలు చెబుతున్నారు. బస్సు డిపో రోడ్డు నుండి గోదావరి నది ప్రాంతం వరకు ఫోర్ లైన్స్ రోడ్డు వెడల్పు రాబోయే పుష్కరాల వరకు పూర్తి చేయాలని శ్రీధర్ బాబు దృఢ సంకల్పంతో ఉన్నారు అయ్యగారి చెరువు రావులచెరువు రెండు చెరువులను సర్వతోముఖ సుందరంగా పూడిక తీసి తయారు చేసినారు ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ వడ్నాల శ్రీనివాస్ వైస్ చైర్మన్ సహేందర్ రెడ్డి, శ్రీధర్ బాబుకు చేదోడు వాదోడుగా ఉంటూ ఆయన అభివృద్ధి భాగంలో పాలుపంచుకుంటూ మంథనిని సర్వతోముఖ సుందరంగా తీర్చిదిద్దడానికి వీరు కూడా ఎంతగానో సహాయపడుతున్నారు. "అభివృద్ధే లక్ష్యం బి ప్రజాసేవే ధ్యేయం" అనే సంకల్పంతో మంత్రి శ్రీధర్ బాబు చేపడుతున్న కార్యక్రమాలు మంథని భవిష్యత్ అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నాయని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

**- జిల్లా కలెక్టర్లు, పోలీస్ అధికారులకు సి.ఎస్. ఆదేశం**



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఏవిధమైన ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లకుండా తగు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. రాష్ట్రంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలు, మరో రెండు రోజుల పాటు కురిసే అవకాశం ఉన్నందున చేపట్టాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమీషనర్లు, ఎస్. పి లతో సి.ఎస్ సంజయ్ జాజు గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో డీజీపీ సి.వీ ఆనంద్, అడిషనల్ డీజీ భగవత్, డిజాస్టర్ మేనేజ్ మెంట్ కార్యదర్శి హరిచందన, నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ, గురువారం రాత్రి కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలుపుతున్నందున జిల్లాల్లో పోలీసు వివిధ శాఖలతో సమన్వయంతో తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రతి జిల్లా కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. పర్యాటక ప్రాంతాలకు వెళ్లకుండా పోలీస్ శాఖ తగు చర్యలను చేపట్టిందని డీజీపీ సి.వీ ఆనంద్ వెల్లడించారు. 12 కంపెనీల ఎస్ డి ఆర్ ఎఫ్ బృందాలు కూడా సిద్ధంగా ఉండాలన్నారు.

## పోచమ్మ తల్లి బోనాలకు హాజరుకావాలని హరివర్ధన్ రెడ్డికి ఆహ్వానం



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** గుండ్ల పోచంపల్లి డివిజన్ గుండ్ల పోచపల్లి పట్టణంలో ఆగస్టు 2న ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి బోనాల తొట్టెల మహోత్సవానికి మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. గుండ్ల పోచంపల్లి మాజీ సర్పంచ్ బేరి ఈశ్వర్ యువజన కాంగ్రెస్ నాయకులు గడిల రాఘవేందర్ రెడ్డి సంపత్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర సర్పంచ్ల ఫోరం మాజీ అధికార ప్రతినిధి గుండ్ల పోచంపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ గరిసెల సురేందర్ ముదిరాజ్లి హరివర్ధన్ రెడ్డిని కలిసి ఆహ్వానించారు.

## సిరిసిల్ల పెద్ద బజార్లో కూలిన భారీ వృక్షం..

**- మినీ వ్యాన్ పై కూలడంతో ఒకరికి గాయాలు**



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) జిల్లా కేంద్రంలోని పెద్ద బజార్లో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఓ భారీ వృక్షం నేల కూలింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎల్లారెడ్డిపేట మండలం అక్కపెల్లి గ్రామానికి చెందిన రాజు అనే వ్యక్తి తన మినీ వ్యాను లో సిరిసిల్లలోని కలెక్టరేట్ కు వెళ్తున్నాడు. స్థానిక గాంధీ చౌరస్తా నుండి పెద్ద బజారు మీదుగా వెళుతున్న సమయంలో హనుమాన్ ఆలయం వద్దకు చేరుకుగానే భారీ వేపచెట్టు ఒకసారిగా నేలకొరిగింది. చెట్టు రాజు వెళ్తున్న వ్యాన్ పై పడడంతో అతడి తలకు గాయాలు అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన స్థానికులు రాజును స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్థానిక కౌన్సిలర్ అటుచెర్ల సాయి కృష్ణ అధికారులకు సమాచారం అందించి రోడ్డుపై కూలిన చెట్టును తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారూ. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇదే ప్రాంతంలోని హనుమాన్ ఆలయం, విమల్ థియేటర్ సమీపంలో ఉన్న భారీ వృక్షాలను తొలగించాలని అధికారులకు సూచించారు. పెద్ద బజార్ రోడ్డులో నేలకూలిన చెట్లు తొలగించాలని గతంలోని అధికారులు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## సూపర్ ఎల్ నినోపై అప్రమత్తం చేయాలి

- రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేలా అవగాహన కల్పించాలి
- జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- సూపర్ ఎల్ నినో పై వివిధ శాఖల అధికారులతో ఐడీఓసీ లో మంత్రుల సమీక్ష



**సిరిసిల్ల(ప్రశ్న న్యూస్)** సూపర్ ఎల్ నినో ప్రభావంపై రైతులు, ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపు నిచ్చారు.సూపర్ ఎల్ నినోపై జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే తో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా సూపర్ ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కునేందుకు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో రూపొందించిన పీపీటిని ప్రదర్శించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, వేములవాడ ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి వివిధ శాఖల అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతపై 'పారిశ్రామిక' దెబ్బ

**- కాలుష్య జలాల కాటుకు కరిగిపోతున్న రైతు రెక్కల కష్టం - అంకిరెడ్డిపల్లిలో పంటల విధ్వంసంపై కర్షక లోకం ఆవేదన**

**- ఈ పవర్ ఎనర్జీ' పరిశ్రమపై కీసర రైతుల తీవ్ర ఆగ్రహం.. నీటి నమూనాలు సేకరించి న్యాయం చేయాలని డిమాండ్.**



కీసర( ప్రశ్న న్యూస్) ఒకవైపు ఆకాశం వైపు చూస్తూ వర్షాల కోసం ఎదురుచూసే రైతులకు, మరోవైపు పారిశ్రామిక వ్యర్థాలు శాపంగా మారుతున్నాయి. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర మండలం అంకిరెడ్డిపల్లి గ్రామ పరిధిలో పరిశ్రమల నుంచి వస్తున్న రసాయన కాలుష్య నీరు పంట పొలాలను ముంచెత్తుతోంది. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 812 లో నెలకొల్పిన (ఈ పవర్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్) కంపెనీ విడుదల చేస్తున్న కాలుష్య జలాల వల్ల తమ పంటలు పూర్తిగా నాశనమవుతున్నాయని స్థానిక రైతులు



కన్నీరుమున్నీరవుతున్నారు.

### సమస్య తీవ్రత -- రైతుల ప్రధాన ఆందోళనలు

ఎండిపోతున్న పంటలు: రాత్రివేళల్లో లేదా రహస్యంగా కంపెనీ పరిసరాల నుంచి బయటకు వదులుతున్న రసాయన వ్యర్థ జలాలు నేరుగా పక్కనే ఉన్న వ్యవసాయ పొలాల్లోకి చేరుతున్నాయి. దీనివల్ల పచ్చగా ఎదగాల్సిన పంటలు చేతికి అందకుండానే ఎండిపోతున్నాయి.భూసారం దెబ్బతినే ప్రమాదం: తీవ్రమైన ఘాటైన రసాయనాలు కలిసిన నీరు భూమిలో ఇంకిపోవడం వల్ల మట్టి తన సారవంతతను కోల్పోతోంది. భవిష్యత్తులో ఈ నేలలు ఏ పంట వేసేందుకు పనికిరాకుండా 'చౌడు భూములు'గా మారే ప్రమాదం ఉందని రైతులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.భూగర్భ జలాలు కాలుష్యం:



పొలాల్లో నిలిచిన వ్యర్థ జలాల వల్ల పరిసర ప్రాంతాల్లోని బోరు బావుల నీరు కూడా రంగు మారి, కలుషితమవుతోందని రైతులు వాపోతున్నారు.

### బాధ్యతారాహిత్యంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు

కాలుష్య నియంత్రణ మం?డలి, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే అంకిరెడ్డిపల్లిలోని సర్వే నంబర్ 812 పరిసర పొలాలను సందర్శించి ప్రత్యక్షంగా పరిశీలించాలి.నీటి



నమూనాల పరీక్ష కంపెనీ నుంచి వెలువడుతున్న వ్యర్థ జలాలను, అలాగే కలుషితమైన పొలాల నీటిని సేకరించి ల్యాబ్‌లో



రసాయన పరీక్షలు జరిపి కాలుష్య తీవ్రతను తేల్చాలి. ఇప్పటివరకు పంట కోల్పోయిన బాధిత రైతులకు వ్యవసాయ శాఖ అధికారులతో సమగ్ర సర్వే చేయించి, ఎకరాకు తగిన పరిహారాన్ని కంపెనీ యాజమాన్యం నుంచి ఇప్పించాలి లేదా




ప్రభుత్వం అందించాలి.

### శాశ్వత పరిష్కారం చూపాలి..

సదరు పరిశ్రమ వ్యర్థ నీటిని శుద్ధి చేయకుండా బయటకు వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. పొలాల్లోకి కాలుష్య నీరు చేరకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి."రెక్కలు ముక్కలు చేసుకుని సాగు చేసిన పంట కళ్లముందే కాలుష్య నీటిలో కుళ్ళిపోతుంటే గుండె తర్లిపోతోంది. అధికారులు తక్షణమే స్పందించి మమ్మల్ని ఆదుకోకపోతే మాకు ఆత్మహత్యలే శరణ్యం." అంకిరెడ్డిపల్లి బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## కట్న వేధింపుల కేసులో భర్తకు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష

**- 2019లో నమోదైన కేసులో నిందితుడిని దోషిగా తేల్చిన కోర్టు**

**- రూ.10 వేల జరిమానా విధింపు**




**కీసర (ప్రశ్న న్యూస్ )** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో 2019లో నమోదైన కట్న వేధింపులు, అనుమానాస్పద మృతి కేసులో నిందితుడికి కోర్టు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధించింది.పోలీసుల వివరాల ప్రకారం, వివాహానంతరం అదనపు కట్నం కోసం భార్య శ్రావణిని శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేయడంతో పాటు ఆమె అనుమానాస్పద మృతికి కారణమైనట్లు ఆరోపణలపై కీసర పోలీస్ స్టేషన్‌లో 08 ఆగస్టు 2019న క్రైమ్ నెం.367/2019గా కేసు నమోదు చేశారు. దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలను న్యాయస్థానంలో సమర్పించగా కేసు విచారణ పూర్తైంది.ఈ మేరకు కుషాయిగూడలోని ప్రధాన జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నిందితుడు కుంచాల రామాంజనేయులు (32), నాగారం రాజ్‌సుఖ్ నగర్ కాలనీ నివాసికి యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.ఈ కేసును అప్పటి ఏసీపీ కె. శివకుమార్ సమర్థవంతంగా దర్యాప్తు చేసి బలమైన సాక్ష్యాధారాలను సమర్పించగా, ప్రాసిక్యూషన్ బృందం సమన్వయంతో నిందితుడికి శిక్ష పడేలా కీలక పాత్ర పోషించింది. కేసు విజయవంతంగా ముగియడంలో కృషి చేసిన దర్యాప్తు అధికారి, ప్రాసిక్యూషన్ బృందం, పోలీసు సిబ్బందిని మల్కాజిగిరి డీసీపీ సి.హెచ్. శ్రీధర్ అభినందించారు.

## గురు పౌర్ణమి వేళ అంకిరెడ్డిపల్లిలో అంబాజీ నింబాజీ దేవతలకు ఘన పూజలు

- కులదైవాల దర్శనానికి భక్తుల రద్దీ
- గ్రామ సుఖశాంతులు, సుభిక్షం కోసం ప్రత్యేక ప్రార్థనలు



**కీసర( ప్రశ్న న్యూస్)** గురు పౌర్ణమి సందర్భంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర్ సర్కిల్ అంకిరెడ్డిపల్లి గ్రామంలో గ్రామస్తులు తమ కులదైవాలుగా భావించే శ్రీ అంబాజీ--నింబాజీ దేవతలకు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏడాది ఆనవాయితీగా జరిగే ఈ వేడుకల్లో మహిళలు, పురుషులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని దేవతలకు మొక్కులు చెల్లించి ప్రత్యేక నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ, అంబాజీ--నింబాజీ దేవతల అనుగ్రహంతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో జీవిస్తున్నారని తెలిపారు. గురు పౌర్ణమి రోజున ఈ పూజలను ఘనంగా నిర్వహించడం ఎన్నో ఏళ్లుగా కొనసాగుతున్న సంప్రదాయమని పేర్కొన్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా, దేవతల ఆశీస్సులతో గ్రామంలో సుభిక్షం, ప్రజలకు ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు చేకూరాలని భక్తులు మనస్ఫూర్తిగా ప్రార్థించారు.

## భారీ వర్షాలు,వరదల వల్ల పలు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- మాజీ ఎంపీపీ .- అరెల్లి దేవక్క కొమురయ్య గౌడ్.**



**మంథని (ప్రశ్న న్యూస్)** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో రామగిరి మండలంతో పాటు పరిసర ప్రాంతాల్లో వాతావరణం పూర్తిగా మారిపోయింది. గత రెండు రోజులుగా ఈదురుగాలులతో కూడిన భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వరద ముప్పు పొంచి ఉందని జాగ్రత్త వుండాలి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పలు గ్రామాల్లో రాకపోకలకు అంతరాయం ఏర్పడే అవకాశముందని పొలాల్లో నీరు నిలిచిపోయాయి.మరోవైపు బలమైన ఈదురుగాలుల కారణంగా చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలిపోయే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.వాతావరణ శాఖ మరో 24 నుంచి 48 గంటల పాటు భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వెల్లడించింది. అవసరం లేకుండా ప్రజలు బయటకు రావద్దని, వాగులు, వంకలు, కాలువలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తూ అధికారులు సూచనలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.అత్యవసర పరిస్థితుల్లో స్థానిక అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలకు సహకరించాలని కోరారువరద ముప్పు దృష్ట్యా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారు సూచించారు.

## హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్‌లో భారీ ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

**- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లాలోని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ వివిధ విభాగాల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. హోటల్, ఫుడ్, హాస్పిటాలిటీ, మార్కెటింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటీ, హెచ్ఆర్, అకౌంట్స్ తదితర రంగాల్లో అనుభవం కలిగిన వారికి ఈ అవకాశాలు అందుబాటులో ఉన్నాయనీ,భర్తీ చేయనున్న పోస్టుల్లో ఆపరేషన్ మేనేజర్, ప్రొడక్షన్ మేనేజర్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్, డిస్ట్రిబ్యూషన్ ఎగ్జిక్యూటివ్, మెయింటెనెన్స్ మేనేజర్, మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇన్‌చార్జ్, స్టోర్ ఎగ్జిక్యూటివ్, క్వాలిటీ ఇన్‌చార్జ్, క్వాలిటీ ఎగ్జిక్యూటివ్, క్వాలిటీ జూనియర్ ఎగ్జిక్యూటివ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, కుక్స్/షెఫ్స్, ఐటీ ఎగ్జిక్యూటివ్, ప్రొక్యూర్‌మెంట్/పర్చేజ్, అకౌంట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు.అభ్యర్థులు సంబంధిత విద్యార్హతలు, అనుభవం కలిగి ఉండాలి. పోస్టును బట్టి 1 సంవత్సరం నుంచి 10 సంవత్సరాలకు పైగా అనుభవం అవసరం ఉంటుంది. వయోపరిమితి పోస్టును బట్టి 21 నుంచి 45 సంవత్సరాల మధ్య నిర్ణయించబడింది.ఎంపికైన అభ్యర్థులకు అర్హత, అనుభవాన్ని బట్టి రూ.18,000 నుంచి రూ.80,000 వరకు వేతనం అందజేయబడుతుంది. కుక్స్/షెఫ్స్ పోస్టులకు వేతనం అనుభవాన్ని బట్టి నిర్ణయిస్తారు. అన్ని పోస్టుల వర్క్ లొకేషన్ మెదక్ ఉంటుంది.ఉద్యోగఅవకాశాలనువినియోగించుకోవాలనుకునే యువత, అనుభవజ్ఞులు తమ అర్హతలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు.అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9372478535 సంప్రదించాలని, సోమవారం రోజున మెదక్ ప్రైవేట్ ఐ టి ఐ సబ్ (స్టేషన్ ఎదురుగా )లో 03-08-2026 రోజున జీశీఎ మేళా ఉంటుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

# నాచారం అర్బన్ ఇంటర్మీడియట్ కాలేజీలో సైబర్ క్రైమ్ పై అవగాహన



**నాచారం (ప్రశ్న న్యూస్)** నాచారం అర్బన్ ఇంటర్మీడియట్ కాలేజీలో నిర్వహించిన సైబర్ క్రైమ్ పై అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు సైబర్ నేరాల నివారణ, పి ఓ సి ఎస్ ఓ చట్టం, డ్రగ్స్ దుష్ప్రభావాలు, రోడ్డు భద్రత, వ్యక్తిగత భద్రత వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా నాచారం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ధనుంజయ గౌడ్ విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, విద్య యొక్క ప్రాముఖ్యత, క్రమశిక్షణ, సైబర్ భద్రత, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించడం, అలాగే బాధ్యతగల పౌరులుగా ఎదగాల్సిన అవసరాన్ని వివరించారు.అనంతరం ఎస్ఐ మైబెల్లి సైబర్ నేరాల నుంచి రక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్ట్ స్కామ్స్, ఫేక్ లోన్ యాప్స్, ఓటిపి మోసాలు, సోషల్ మీడియా మోసాల గురించి అవగాహన కల్పించారు. సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని, అలాగే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ రామ్ మోహన్ సమన్వయం చేయగా, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొని సైబర్ నేరాల నివారణకు సంబంధించిన విలువైన సూచనలు, జాగ్రత్తలను తెలుసుకున్నారు.

# ప్రజా సమస్యలపై ఉద్యమించేందుకు ప్రాంతీయ సరిహద్దులు అడ్డుకావు

- పి. వెంకటేష్, కన్వీనర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ ఎన్.ఆర్.ఐ. సెల్
- బీసీలను కించపరుస్తూ, బీసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం
- బీసీల హక్కులు, సంక్షేమం, అభ్యున్నతికి పాటుపడుతున్న ఆర్ కృష్ణయ్యపై సీయం వ్యాఖ్యలు చేయటం సిగ్గుచేటు
- సమస్యల సాధనలో భాగంగా ఉద్యమాలు, పోరాటాలకు ప్రాంతీయ సరిహద్దులకు సంబంధమేంటి
- ఆర్ కృష్ణయ్య పై సీయం చేసిన వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకోవాలి



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రజా సమస్యలపై ఉద్యమిచేందుకు ప్రాంతీయ సరిహద్దులు అడ్డుకాదని, బీసీలు హక్కులు, బీసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నేషనల్ ఎన్.ఆర్.ఐ. కన్వీనర్ పి. వెంకటేష్ పేర్కొన్నారు. ఇటీవల జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య పై రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో గురువారం నాడు ఆయన మాట్లాడుతు గత 50 సంవత్సరాలుగా దేశ వ్యాప్తంగా బీసీల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న పోరాట యోధులు, బీసీ వర్గాల ఆశాజ్యోతి ఆర్. కృష్ణయ్య పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమన్నారు. ?ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లోను, విభజన అనంతరం విడిపోయిన రెండు తెలుగు రాష్ట్రాల్లోను బీసీ అభ్యున్నతి కోసం అలుపెరగని పోరాటాలు చేసి, లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపి, గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో రిజర్వేషన్లు సాధించిపెట్టిన ఘనత ఆర్. కృష్ణయ్య కే దక్కుతుందన్ని ఉద్ఘాటించారు. గత 50 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఏనాడు పదవుల కోసం పాకులాడలేదని, కేవలం బీసీ అభ్యున్నతి కోసం నిస్వార్థంగా 16 వేలకు పైగా ఆందోళనలు, ఉద్యమాలు చేసి సేవలందించిన అసలుసిసలైన నాయకుడు ఆర్. కృష్ణయ్య అని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎంపీగా ఆంధ్రప్రదేశ్ నుండి ప్రతినిత్యం వహిస్తున్న ఆర్. కృష్ణయ్య ఆంధ్రప్రదేశ్ లో పోరాటాలు చేయాలి గానీ తెలంగాణలో ఎందుకు అని సీఎం రేవంత్ రెడ్డి అనడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమని ఎద్దేవ చేశారు. బీసీ ఉద్యమాలకు, ప్రజా పోరాటాలకు ఎటువంటి సరిహద్దులు ఉండవని, సమాజంలో అన్యాయం ఎక్కడ జరిగితే అక్కడ గళం ఎత్తే నిజమైన ప్రజా నాయకుడు ఆర్. కృష్ణయ్య అని, అటువంటి జాతీయ బీసీ నేతను ఉద్దేశించి సీఎం స్థాయి వ్యక్తి అలా వ్యాఖ్యానించడం బీసీలను, బీసీ ఉద్యమాలను కించపరచడమే అవుతుందని విమర్శించారు. బీసీల గొంతును అణచివేయాలనుకోవడం అవివేకమని, బీసీలను కించపరిచే విధంగా వ్యవహరిస్తే రాష్ట్రవ్యాప్తంగా తీవ్రమైన వ్యతిరేకత ఎదుర్కోనక తప్పదని హెచ్చరించారు. వెంటనే రేవంత్ రెడ్డి బీసీల ఆశాజ్యోతి ఆర్ కృష్ణయ్యపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసారు. రాష్ట్ర ప్రభుత్వం లక్షలాది మంది బీసీ విద్యార్థుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, 14 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు, విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేయాలి డిమాండ్ చేశారు. బీసీల సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థి సంఘాలతో కలిసి కలెక్టరేట్లు, ఆర్.డి.ఓ., ఎం.ఆర్.ఓ. కార్యాలయాల ముట్టడితో పాటు భారీ నిరసన కార్యక్రమాలు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తామని పి. వెంకటేష్ హెచ్చరించారు.

# పెద్దపెల్లి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు నల్మాస్ ప్రభాకర్‌కు స్వర్ణ కంకణంతో సత్కారం



**మంథని( ప్రశ్న న్యూస్)** మంథని మండలంలో గత 25 సంవత్సరాల నుండి వైశ్య సంఘం ద్వారా ఇతర వేదికల ద్వారా వైశ్యులకు వైశ్య ధరలు. సామాజిక వర్గాల వారికి చేస్తున్న సేవలకు గుర్తింపుగా హైదరాబాద్ కు చెందిన లలిత కళా సమాఖ్య సామాజిక సాంస్కృతిక సేవా సంస్థ వారిచే అత్యున్నతమైన వైశ్య వైభవ రత్న .బిరుదు అవార్డుతో పాటు సువర్ణ కంకణం పథకంతో సత్కరించడానికి ఎంపికైన సందర్భంగా గురువారం రోజు రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పన్నూరు మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మాజీ జెడ్పిటిసి గంద్ర వెంకటరమణ రెడ్డి. మాజీ ఎంపీపీ చంద్రయ్య . జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బుచ్చన్న యూత్ కాంగ్రెస్ నాయకులు రావిగంటి సతీష్ ప్రభాకర్.కు వీరందరూ కలిసి కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సన్మానించినారు వైశ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలి

- ప్రభుత్వ ఆసుపత్రి ఉచిత వైద్య సేవలను ప్రజలు వినియోగించుకోవాలి
- జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ సమీక్ష



**గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )** వర్షాకాలంలో వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించి సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండాలని సిద్ధిపేట జిల్లా గజ్వేల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ సమీక్ష ప్రజలకు సూచించారు.జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, ఇళ్ల పరిసరాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, వేడి ఆహారం తీసుకోవడంతో పాటు కాచి వడబోసిన నీటినే తాగాలని సూచించారు. ముఖ్యంగా చిన్నారులు ఉన్న కుటుంబాలు పరిశుభ్రత విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించి అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. దోమల ద్వారా వ్యాపించే మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యవసర వైద్య సేవలతో పాటు సాధారణ వైద్య పరీక్షలు, ఇతర ప్రత్యేక వైద్య సేవలు నిత్యం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రతి నెల 300 నుంచి 350 మంది గర్భిణులకు ప్రసవ సేవలు విజయవంతంగా అందిస్తున్నామని, అలాగే డయాలసిస్ రోగులకు నాణ్యమైన చికిత్సలు అందిస్తున్నామని వెల్లడించారు.ఈ సమావేశంలో ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రణీతతో పాటు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

- 12 ఏళ్లగా ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తున్న గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం





**పటాన్‌చెరు (ప్రశ్న న్యూస్)** సమాజ సేవ, సుస్థిర అభివృద్ధి పట్ల తన నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, హైదరాబాదులోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం గురువారం రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు క్లాస్ మేట్ నోట్ బుక్ లు, క్రేయాన్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్టేషనరీ కిట్లతో పాటు భోజనం ప్లేట్లను పంపిణీ చేసింది.చుట్టుపక్కల గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల విద్యా అవసరాలకు మద్దతుగా, గత 12 సంవత్సరాలుగా గీతం నిరంతరం నిర్వహిస్తున్న సుదీర్ఘకాల అవుట్-రీచ్ కార్యక్రమంలో ఇది ఒక భాగం.ఈ పంపిణీ కార్యక్రమం, వ్యర్థాల నుంచి సంపద అనే నినాదంతో గీతం చేపడుతున్న సుస్థిరతా ప్రయత్నం. ఈ కార్యక్రమం ద్వారా, గీతం విద్యార్థులు ఆతిథ్య విభాగం సహకారంతో ప్రాంగణం నుంచి చదివేసిన వార్తాపత్రికలు, పాత రికార్డులు, పుస్తకాలు, ఇతర పునర్వినియోగ కాగితపు సామగ్రిని సేకరిస్తారు. ఈ సామగ్రిని రీసైక్లింగ్ కోసం ఐటీసీ పేపర్ బోర్డ్స్ అండ్ స్పెషాలిటీ పేపర్స్ విభాగానికి అప్పగిస్తారు. ప్రతిఫలంగా, ఐటీసీ క్లాస్ మేట్ విద్యా ఉత్పత్తులను అందిస్తుంది.

వీటిని పేద విద్యార్థులకు పంపిణీ చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత రెండింటినీ గీతం ప్రోత్సహిస్తోంది.ఈ విద్యా కిట్లను గీతం హైదరాబాద్ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ పీవీ నాగేంద్రకుమార్, గీతం పూర్వ విద్యార్థి, ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనూజ్ తదితరులు పంపిణీ చేయగా, ఇ-క్లబ్ చైర్మన్ మాధవ్ భాస్కర్, ఇ-క్లబ్ సభ్యులు సహకరించారు.విద్యార్థులు నోట్ బుక్ లు, స్టేషనరీ కిట్లను ఎంతో ఉత్సాహంగా స్వీకరించి, చిరునవ్వులతో, హృదయపూర్వక కృతజ్ఞతతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు తమ విద్యార్థులకు గీతం, ఐటీసీ అందిస్తున్న నిరంతర మద్దతు, సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంపై శాశ్వత సానుకూల ప్రభావాన్ని సృష్టించే కార్యక్రమాల ద్వారా నాణ్యమైన విద్య, పర్యావరణ సుస్థిరత, అర్థవంతమైన సామాజిక భాగస్వామ్యాన్ని పెంపొందించడానికి గీతం కట్టుబడి ఉందని చెప్పారు.

## తెలంగాణ గడ్డపై కాషాయ జెండా

# ఎగరడం ఖాయం

- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్నాథ్ సింగ్ కు ఎంపీ ఈటల హామీ



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్ )** కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఢిల్లీలో కలిసి పలు అభివృద్ధి పనులతో పాటు తెలంగాణ రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు.బీజేపీ తెలంగాణలో పట్టు సాధించడానికి అవకాశాలు మెండుగా ఉన్నాయని దీనిని అందిపుచ్చుకోవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ మేడ్చల్ మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ కు సూచించగా కేంద్ర నాయకత్వం సహకారం, రాష్ట్ర నాయకుల సమన్వయంతో ఈసారి తెలంగాణ గడ్డపై కషాయ జెండా ఎగురవేస్తామని ఈటల రాజేందర్ , రాజనాథ్ సింగ్ కి తెలిపారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి అదనపు నిధులు కేటాయించాలని ఈ సందర్భంగా ఈటల రాజేందర్ కోరారు.కౌకురు దర్గా నుండి బిట్స్ పిలాని వరకు డిఫెన్స్ భూములలో రోడ్డు నిర్మాణం, విస్తరణకు అనుమతి ఇవ్వాలని కోరారు.దీనితో పాటు డిఫెన్స్ ఏరియాలో పలు రోడ్ల విస్తరణ మరియు సామాన్య ప్రజలకు అనుమతి ఇవ్వాలని కూడా కోరారు.తాజాగా రాజనాథ్ సింగ్ గారి తెలంగాణ పర్యటన గురించి ఇరువురి మధ్య చర్చకు వచ్చింది. తెలంగాణలో పార్టీ పటిష్టతకు కృషి చేయాలని రాజ్ నాథ్ సింగ్ ఎంపీ ఈటలకు సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల మధ్యకు తీసుకెళ్లి బిజెపి అధికారంలోకి వచ్చే విధంగా నాయకులు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

- నాణ్యతతో, పారదర్శకంగా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని అధికారులకు మంత్రి శ్రీధర్ బాబు ఆదేశం



**నాచారం(ప్రశ్న న్యూస్ )** తెలంగాణ రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు వాణిజ్య శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో రూ.76.46 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణా రెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ మిక్కిలినేని మను చౌదరి, ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా, కీసర డివిజన్ ఆర్డీఓ, ఎంఎంసీ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రావు, డిప్యూటీ కమిషనర్ (ఉప్పల్) ఆనంద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ బాబు, డిసిసి అధ్యక్షులు వజ్రెష్ యాదవ్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.యువతకు ఆధునిక క్రీడా సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో భజరంగ్ వ్యాయామశాల భవనం గ్రౌండ్ ఫ్లోర్ విస్తరణ, బోర్‌వెల్ ఏర్పాటు, ఆధునిక జిమ్ పరికరాల ఏర్పాటుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ పనుల ద్వారా క్రీడాకారులకు మెరుగైన శిక్షణ వాతావరణం కల్పించనున్నారు.ఈ ప్యాకేజీ కింద ప్రధాన స్టార్మ్ వాటర్ డ్రైన్ల నిర్మాణం, ఫుట్‌పాత్‌ల అభివృద్ధి, మల్టీ స్పోర్ట్స్ అరేనా నిర్మాణం, పలు కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతులు, వి.టి. కమాన్ వద్ద బస్ స్టాప్ అభివృద్ధితో పాటు అనుబంధ మౌలిక వసతుల కల్పన పనులకు శ్రీకారం చుట్టారు. ఈ పనులు వర్షపు నీటి పారుదల వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు మెరుగైన రవాణా, క్రీడా సౌకర్యాలను అందించనున్నాయి.

## తుర్కపల్లి బాలుర వసతి గృహం

# ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులకు పోషిక ఆహారం అందించాలని డా. ఆనంద్ సూచన



**మేడ్చల్( ప్రశ్న న్యూస్ )** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. కె. ఆనంద్ తుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ (బాలుర వసతి గృహం)ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సింగ్ అధికారి నిర్వహిస్తున్న ఆరోగ్య రికార్డులు, మందుల లభ్యత, వంటశాల (కిచెన్), వసతి గృహంలోని పారిశుద్ధ్య పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు.విద్యార్థులకు అందిస్తున్న ఆహారం నాణ్యతను స్వయంగా పరిశీలించిన డా. కె. ఆనంద్, వంటకు ఉపయోగిస్తున్న కూరగాయల నాణ్యత, నిల్వ విధానం, పరిశుభ్రత ప్రమాణాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే ఆహారం తాజాగా, పోషక విలువలతో కూడినదిగా ఉండేలా నిరంతరం పర్యవేక్షించాలని సంబంధిత సిబ్బందికి సూచించారు.తనిఖీ సందర్భంగా విద్యార్థులకు అందించాల్సిన గుడ్ల నిల్వ పూర్తిగా లేకపోవడం గమనించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, సంబంధిత అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లి, విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన పోషకాహారం ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతరం అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.వసతి గృహం సామర్థ్యం 783 మంది కాగా, ప్రస్తుతం 679 మంది విద్యార్థులు నివాసం ఉంటున్నట్లు పరిశీలనలో వెల్లడైంది. విద్యార్థులకు అందించే ఆహారంలో నాణ్యత, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, కూరగాయలు మరియు ఇతర ఆహార పదార్థాల నిల్వ విధానం, హాస్టల్ పరిసరాల పరిశుభ్రతను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు.అదనంగా, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంటూ, అవసరమైతే ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాలను వసతి గృహానికి పంపించి ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామని, లేదా విద్యార్థులను సమీపంలోని తుర్కపల్లి/శామీర్‌పేట్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువచ్చి వైద్య పరీక్షలు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేసి విద్యార్థుల ఆరోగ్యం, సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు.

# పోలీసు శాఖలో ఇదేం తీరు

- ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తున్న కొందరు అధికారుల వ్యవహారం - తప్పు చేసిన వారిపై కఠిన చర్యలే పోలీసు వ్యవస్థపై విశ్వాసాన్ని నిలబెడతాయి
- జూబ్లీ హిల్స్ సీఐ శ్రీనివాస్ రెడ్డిని ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించాలని ప్రజల డిమాండ్
- పోలీసు శాఖలో కొంతమంది అధికారుల తీరుపై అంతర్గత పర్యవేక్షణ కరువైందా.?
- నేడు వెలుగులోకి వచ్చిన సీఐ శ్రీనివాస్ రెడ్డి వ్యవహారం, వెలుగులోకి రాని అధికారుల పరిస్థితి ఏంటి.?

**హైదరాబాద్(ప్రశ్న న్యూస్)** పోలీసు శాఖ అంటేనే ఒక విశ్వాసం, నమ్మకం, బాధితులకు అండ, భరోసా కానీ కొంతమంది అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం, అధికార దుర్వినియోగంతో పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుంది. పోలీస్ స్టేషన్ కి వెళ్తే కచ్చితంగా న్యాయం జరుగుతుంది అని చెప్పే బాధితులు ఎంతమంది ఉన్నారో ఉన్నత అధికారులకే తెలియాలి. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన తాజా ఘటన నేపథ్యంలో మరోసారి పోలీసు వ్యవస్థలో జవాబుదారీతనం, క్రమశిక్షణ, ప్రజల విశ్వాసం వంటి అంశాలపై చర్చ మొదలైంది. ఒక అధికారి మీద ఆరోపణలు వచ్చినంత మాత్రాన మొత్తం పోలీసు శాఖను తప్పుపట్టడం సరైంది కాదు. అయితే ప్రజల రక్షణ కోసం పనిచేయాల్సిన బాధ్యత కలిగిన కొందరు అధికారులు అధికారాన్ని దుర్వినియోగం చేశారనే ఆరోపణలు వచ్చినప్పుడు వాటిపై వేగంగా, పారదర్శకంగా కఠిన చర్యలు తీసుకోవడం ఉన్నత అధికారులకు అత్యంత అవసరం. కానీ ఇటీవల కిందిస్థాయి అధికారుల బాధ్యతారాహిత్యం, నిర్లక్ష్యం, అవినీతిపై ఎలాంటి చర్యలు లేకపోవడంతో ప్రజలకు సరైన సేవలు అందడం లేదనే విమర్శలు తీవ్రంగా వినిపిస్తున్నాయి.

### తప్పు చేసిన అధికారులకు కఠిన శిక్ష తప్పనిసరి

ప్రజల ప్రాణాలు, ఆస్తులు, గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంటుంది. అలాంటి బాధ్యతలో ఉన్నవారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేశారని నిరూపితమైతే చట్టప్రకారం కఠిన శిక్షలు విధించాలి. శాఖాపరమైన చర్యలతో పాటు అవసరమైతే ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగించి క్రిమినల్ చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలి. అలాంటి చర్యలే ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని బలపరుస్తాయి.

### అంతర్గత పర్యవేక్షణ మరింత బలోపేతం కావాలి

పోలీసు శాఖలో ఉన్నతాధికారులు స్టేషన్ల పనితీరు, అధికారుల ప్రవర్తన, ప్రజలతో వ్యవహరించే తీరు వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ తగ్గడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయన్న అనుమానాలు ప్రజల వ్యక్తం చేస్తున్నారు. ప్రజల నుండి వస్తున్న ఫిర్యాదులపై స్వతంత్రంగా విచారణ జరిగే విధానాలను ఉన్నత అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షించాలని డీసీపీ స్థాయి అధికారుల పర్యవేక్షణ పూర్తిస్థాయిలో లేకపోవడంతో సిఐ, ఎస్ఐ, కానిస్టేబుల్ ల పనితీరు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతోంది. డిసిపి కంటే పై స్థాయి అధికారుల పర్యవేక్షణ సమర్థవంతంగా అమలు చేస్తే అక్రమాలకు అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది.

### బాధితులకు భయంలేకుండా ఫిర్యాదు చేసే వాతావరణం అవసరం

పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తి న్యాయం కోసం వస్తాడు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, బలహీన వర్గాల వారు ఎలాంటి భయం లేకుండా తమ సమస్యలను చెప్పుకునే పరిస్థితి ఉండాలి. వారి ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి చట్టబద్ధంగా పరిష్కరించడం పోలీసుల బాధ్యత కానీ రాజకీయ నాయకుల, ఆర్థిక ప్రలోభాలకు ప్రభావితమై సిబ్బంది, అధికారులు బాధితులకు సరైన న్యాయం చేయడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ప్రభుత్వము, ఉన్నత అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం చాలా ఉంది.

### కొద్దిమంది తప్పిదాల వల్ల మొత్తం శాఖ ప్రతిష్ఠ దెబ్బతినకూడదు

తెలంగాణ పోలీసు శాఖలో నిజాయితీగా, అంకితభావంతో పనిచేస్తున్న వేలాది మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు. కానీ కొద్దిమంది తప్పు చేస్తే ఆ ప్రభావం మొత్తం శాఖపై పడుతుంది. ముఖ్యంగా పోలీస్ స్టేషన్లో ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ఎస్సై, సిఐల వ్యవహారంతోనే పరిస్థితి మారుతుంది. ఎక్కువ వరకు వాళ్ల పనితీరుతోనే ప్రజల నుండి మెప్పులు కానీ విమర్శలు కానీ వస్తాయి వాళ్ల పై అంతర్గతంగా పూర్తిస్థాయిలో ఎప్పటికప్పుడు నిఘ ఉంచాల్సిన అవసరం చాలా ఉంది. అందుకే తప్పు చేసిన అధికారులు, సిబ్బంది పై వేగంగా కఠిన చర్యలు తీసుకోవడం ద్వారా నిజాయితీగా పనిచేసే అధికారుల ప్రతిష్ఠను



కూడా కాపాడాల్సిన అవసరం ఉంది.

### ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు అసలైన బలం

ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళితే న్యాయం జరుగుతుందనే విశ్వాసం ప్రజాస్వామ్య వ్యవస్థకు అత్యంత కీలకం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం పోలీసు శాఖ బాధ్యత. పోలీస్ స్టేషన్లలో రాజకీయ, ఆర్థిక ప్రలోభాలకు అధికారులు లోనుకావడం వల్ల ప్రజలకు న్యాయం జరుగుతలేదు అన్నది బహిరంగ చర్చ. ఇప్పటికైన పారదర్శక దర్యాప్తు, జవాబుదారీతనం, బాధితుల పట్ల సున్నితమైన వైఖరి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్న జిజ్ఞాస ఉంటేనే ప్రజల్లో పోలీస్ స్టేషన్ల పై నమ్మకం మరింత పెరుగుతుంది.

# సురభి ఉడిపి హోటల్లో ఈగల భోజనం

- అశుభ్రతకు అడ్డాగా నగర హోటళ్లు
- ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తని ఫుడ్ ఇన్స్పెక్టర్ల బాధ్యతారాహిత్యం
- నిద్రలో ఫుడ్ ఇన్స్పెక్టర్లు, నిర్లక్ష్యంలో ఉన్నత అధికారులు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం, పర్యవేక్షణ ఎక్కడ.?
- ప్యారడైస్ హోటల్ పక్కన ఉన్న సురభి హోటల్ పై చర్యలేవి.?
- బాధ్యతల నిర్వహణలో జోనల్ కమిషనర్లు, మున్సిపల్ కమిషనర్లు, పూర్తిగా విఫలం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** గ్రేటర్ హైదరాబాద్ నగరంలోని చాలా హోటళ్లలో పరిశుభ్రత పూర్తిగా గాలికి వదిలేయబడిన పరిస్థితుల పై ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. తాజాగా సికింద్రాబాద్ ప్యారడైజ్ హోటల్ పక్కన ఉన్న సురభి ఉడిపి హోటల్‌లో ఆహారంలో ఈగలు వచ్చిన దృశ్యాలు వినియోగదారులను విస్మయానికి గురి చేస్తున్నాయి. ప్రజలు డబ్బులు చెల్లించి భోజనం చేస్తుంటే, వారికి నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందించాల్సిన బాధ్యత హోటల్ యాజమాన్యాలపై ఉంది. అయితే కొందరు నిర్వాహకులు లాభాల కోసం పరిశుభ్రతను పూర్తిగా విస్మరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నగరంలో కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలపై వరుసగా అనేక ఘటనలు వెలుగులోకి వస్తున్నప్పటికీ, హోటళ్ల పరిశుభ్రతపై మాత్రం పర్యవేక్షణ, కఠిన చర్యలు ఎక్కడ కనిపించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వంటశాలలు, నిల్వ గదులు, భోజనశాలల పరిస్థితిని తరచుగా తనిఖీ చేయాల్సిన ఫుడ్ సేఫ్టీ అధికారులు ఎక్కడ ఉన్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### అధికారుల పర్యవేక్షణ అసలు లేకపోవడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యం..

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించే హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన ఫుడ్ ఇన్స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో కనిపించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన వ్యవస్థ నిర్వీర్యమైతే, హోటల్ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరించే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తమవుతోంది. జోనల్ కమిషనర్లు జిహెచ్ఎంసి కమిషనర్ కేవలం కార్యాలయాలకు పరిమితమయ్యారా అందుకోసమే జిహెచ్ఎంసిలో ఫుడ్ ఇన్స్పెక్టర్లు అసలు విధులు నిర్వహించకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది.

### ఫిర్యాదులకు స్పందన ఎక్కడ.?

హోటళ్లలో పరిశుభ్రత లోపాలపై ఫిర్యాదులు చేయడానికి ప్రయత్నించినా సంబంధిత అధికారులను సంప్రదించడం కష్టంగా మారిందని పలువురు వినియోగదారులు వాపోతున్నారు. ప్రజల సమస్యలు వినాల్సిన అధికారులు అందుబాటులో లేకపోతే, బాధితులు ఎవరిని ఆశ్రయించాలనే ప్రశ్న తలెత్తుతోంది. అధికారులకు ఎన్నిసార్లు ఫోన్ చేసిన ఎత్తడం లేదని ఫుడ్ ఇన్స్పెక్టర్ల పనితీరు పూర్తిగా శూన్యమని ఇందుకు మున్సిపల్ కమిషనర్లే బాధ్యత వహించాలని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రజల ఆరోగ్యం కంటే నిర్లక్ష్యమే ఎక్కువా.?

ప్రజల పన్నుల రూపంలో వచ్చే సొమ్ముతో లక్షలలో జీతాలు తీసుకుంటున్న అధికారులు ప్రజారోగ్య పరిరక్షణను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ప్రజల సొమ్ము తింటూ ప్రజలకే నమ్మకద్రోహం చేస్తున్నారని కొన్ని హోటల్ నుండి అధికారులకు ప్రతినెల మామూలు వస్తాయని అందుకోసమే పర్యవేక్షణ లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పరిశుభ్రత నిబంధనలు పాటించని హోటళ్లపై నిరంతర తనిఖీలు నిర్వహించి, ఉల్లంఘనలు నిర్ధారణ అయితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

### కమిషనర్,ఉన్నతాధికారులు జోక్యం చేసుకోరా.?

ఉన్నత అధికారులు విధుల పట్ల పూర్తి నిర్లక్ష్యం చేయడం వల్లే కిందిస్థాయి అధికారులు సిబ్బంది బాధ్యతరాహిత్యంగా వ్యవహరిస్తున్నారు ఎందుకు కారణం ఉన్నత అధికారుల వైఫల్యమే అన్న విమర్శలు రోజురోజుకు వినిపిస్తున్నాయి. ఫుడ్ ఇన్స్పెక్టర్ అధికారులు ప్రజలు ఎన్నిసార్లు ఫోన్ చేసిన అసలు



ఎత్తకపోవడం తీవ్ర దుమారాన్ని రేపుతోంది.

నగరంలోని హోటళ్లలో పరిశుభ్రత, ఆహార భద్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని, నిబంధనలు పాటించని హోటళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఫుడ్ సేఫ్టీ వ్యవస్థ పనితీరును సమీక్షించి, బాధ్యతారాహిత్యం లేదా విధుల పట్ల నిర్లక్ష్యం ఉన్నట్లు తేలితే సంబంధిత అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



# గుంతల మయంగా మారిన గజ్వేల్

## - జాలిగామ ప్రధాన రహదారి

- వర్షపు నీటితో కనిపించని గుంతలు, నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్



**గజ్వేల్ (ప్రశ్న న్యూస్)** సిద్దిపేట జిల్లా గజ్వేల్--ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గజ్వేల్ నుంచి జాలిగామ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి ప్రయాణికులకు ప్రాణసంకటంగా మారింది. రహదారి పొడవునా భారీ గుంతలు ఏర్పడటంతో నిత్యం వందలాది మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో అవి కనిపించక ద్విచక్ర వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిపై ప్రతిరోజూ గ్రామాల ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు రాకపోకలు సాగిస్తుండగా, దెబ్బతిన్న రహదారి కారణంగా ప్రయాణం నరకప్రాయంగా మారింది. వర్షపు నీటితో గుంతలు కప్పుకుపోవడంతో ప్రమాదాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, ఆర్ అండ్ బి శాఖ అధికారులు వెంటనే స్పందించి యుద్ధప్రాతిపదికన రహదారికి మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చివేసి ప్రజలకు సురక్షిత ప్రయాణం కల్పించాలని స్థానికులు, వాహనదారులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

# పేపర్ లీక్ ముఠాలను ఇక సహించేది లేదు

## - ఇన్‌స్టాలో మోదీ కొత్త సందేశం



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులను అరికట్టే సవరణ బిల్లుకు పార్లమెంట్ ఆమోదం లభించడాన్ని ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ సందర్భంగా ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో విడుదల చేసిన ఆయన.. పేపర్ లీక్ మాఫియాపై ఇక కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గత కొన్ని దశాబ్దాలుగా రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలన్నీ పేపర్ లీకుల సమస్యను ఎదుర్కొన్నాయని మోదీ గుర్తుచేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని అన్నారు. పరీక్షల వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడానికి ప్రభుత్వం ఇప్పటికే పలు సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. పరీక్షల నిర్వహణలో సాంకేతికత వినియోగాన్ని పెంచడం, వేగవంతమైన వ్యవస్థలను అమలు చేయడం, పారదర్శకతను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కొత్త చట్టంతో పేపర్ లీక్ ముఠాలపై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# ప్రియాంక 'గోమూత్ర నిపుణుడు' వ్యాఖ్య

## - భగ్గుమన్న 200 మంది విద్యావేత్తలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా ఉన్న విద్యావేత్తలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి. కామకోటిని ఉద్దేశించి ఆమె "గోమూత్ర నిపుణుడు" అని వ్యాఖ్యానించడాన్ని తప్పుబడుతూ 200 మందికి పైగా ప్రముఖులు ఒక బహిరంగ లేఖను విడుదల చేశారు. మంగళవారం లోక్‌సభలో 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అక్రమ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు, 2026'పై జరిగిన చర్చలో ప్రియాంక గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల సంస్కరణల నిమిత్తం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ సభ్యుల నియామకాన్ని ప్రశ్నిస్తూ ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. తన ప్రసంగంలో ఆమె ఎవరి పేరునూ నేరుగా ప్రస్తావించనప్పటికీ, ఆ విమర్శలు కమిటీ సభ్యుడైన ప్రొఫెసర్ కామకోటిని ఉద్దేశించినవేనని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో 215 మంది వైస్ ఛాన్సలర్లు, మాజీ వైస్ ఛాన్సలర్లు, విద్యావేత్తలు సంతకాలు చేసిన లేఖలో ప్రియాంక తీరును తీవ్రంగా ఖండించారు. రాజకీయ విమర్శల కోసం ఒక ప్రముఖ శాస్త్రవేత్తను కించపరిచేలా మాట్లాడటం సరికాదని, ఇటువంటి ధోరణి రాజ్యాంగం నిర్దేశించిన శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రొఫెసర్ కామకోటి ఐఐటీ మద్రాస్‌లోనే పీహెచ్‌డీ పూర్తి చేశారని, 150కి పైగా పరిశోధన పత్రాలను సమర్పించారని, డీఆర్‌డీఓ అకడమిక్ ఎక్సలెన్స్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారని వారు ఈ సందర్భంగా గుర్తుచేశారు. భారత్ తొలి ఇండస్ట్రీ-గ్రేడ్ మైక్రోప్రాసెసర్ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన గొప్ప సాంకేతిక నిపుణుడిపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం అనుచితమని వారు హితవు పలికారు. పార్లమెంట్ చర్చలు గౌరవప్రదంగా, హుందాగా జరగాలని వారు సూచించారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588